కొనసాగిన ఒకేషనల్ ప్రాక్టికల్ పరీక్షలు

కొత్తచెరువు, ఫిబ్రవరి 6: జిల్లావ్యాప్తంగా ఇంటర్ ప్రథమ, ద్వితీయ ఒకేషనల్ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు మంగళవారం రెండోరోజు కొనసాగాయి. జిల్లాలో మొదటి సంవత్సర పరీక్షలకు మొత్తం 693 మంది ఒకేషనల్ విద్యార్థులకుగాను.. 639 మంది హాజరయ్యారని ఆర్ఐఓ సురేశ్‌బాబు ప్రకటనలో తెలిపారు. ద్వితీయ సంవత్సరానికి సంబంధించి 481 మందికిగాను 453 మంది హాజరయ్యారన్నారు. మండల కేంద్రంలోని సత్యసాయి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్షలు కొనసాగుతున్నాయన్నారు.

మార్పు ఏదీ?

అభివృద్ధికి ఆమడదూరం మెళవాయి గ్రామం



ఈ ఫొటో చూశారా. ఇవేవో ఊరి బయట ఉన్న నీటి నిల్వ గుంతలు అనుకుంటే తప్పులో కాలేసినట్లే. ఇవి మెళవాయి గ్రామ సచివాలయ భవన నిర్మాణం కోసం తవ్విన పునాది గుంతలు. కాంట్రాక్టర్ పునాది గుంతలు తవ్వేసి.. బిల్లులు రావన్న భయంతో పనులు ఆపేశారు. వదిలేశారు. వైసీపీ ప్రభుత్వంపై ఉన్న నమ్మకం అలాంటిది అంటూ ఊరి జనం విమర్శిస్తున్నారు.

- పునాదులకు నోచుకోని సచివాలయం
- మహిళా సంఘాల భవనంలో నిర్వహణ
- కమ్యూనిటీ భవనంలో ఆర్బీకే
- పనులు ఆగిపోయి.. గడ్డకట్టిన సిమెంటు బస్తాలు
- ఊరు మారిందంటూ పాలకుల గొప్పలు
- మార్పు అంటే ఇదేనా అంటూ గ్రామస్థుల అసహనం



ఇవి సిమెంటు బస్తాలే. ప్రజాధనం రూ.వేలు పోసి తెప్పించినవి. వీటిని సచివాలయ భవన నిర్మాణం కోసం తెప్పించారు. పనులే మొదలు కాకపోవడంతో సిమెంటు బస్తాలు ఇలా గడ్డకట్టుకుపోయి, నిరుపయోగంగా మారిపోయాయి. వైసీపీ పాలనలో అభివృద్ధి గడ్డ కట్టిందన్నమాట.



ఇది మెళవాయి గ్రామ సచివాలయమే. భవన నిర్మాణం పునాదులకు కూడా నోచుకోకపోవడంతో మహిళా సంఘాల భవనాల్లోని రెండు ఇరుకు గదుల్లో నిర్వహిస్తున్నారు. అందులో పనిచేసే సిబ్బంది, వివిధ పనుల మీద వచ్చే ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు.



డ్రైనేజీ కాలువ లేక రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు



ఇది రైతు భరోసా కేంద్రమే కానీ, నిర్వహిస్తున్నది మాత్రం కమ్యూనిటీ హాల్‌లో. మెళవాయి గ్రామంలో ఆర్బీకే భవనం నిర్మించకపోవడంతో గత్యంతరం లేక కమ్యూనిటీ హాల్‌లో నిర్వహిస్తున్నారు.

వైసీపీ పాలనలో గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి పడకేసింది. రాష్ట్ర ప్రభుత్వం పైసా ఇవ్వకపోగా.. కేంద్రం ఇచ్చే ప్రణాళిక సంఘం నిధులను సైతం కాజేసింది. దీంతో పంచాయతీ ఖాతాలు ఖాళీ అయ్యాయి. విద్యుత్ దీపాల ఏర్పాటుకు కూడా సర్పంచ్‌లు అప్పులు చేసి, సొంత డబ్బు వెచ్చించాల్సి వస్తోంది. పంచాయతీ కార్మికులకు నెలల తరబడి వేతనాలు అందట్లేదు. దీంతో వారు పనులు చేసేందుకు అయిష్టత చూపుతున్నారు. వెరసి.. చెత్తతో సంపద తయారీ కేంద్రం ఇద్దో.. ఇలా నిరుపయోగంగా మారిపోయింది.



కనీస వసతులులేని ప్రసూతి కేంద్రం



మడకశిర రూరల్, ఫిబ్రవరి 6:
మడకశిర మండలంలోని మెళవాయి గ్రామం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. వైసీపీ ప్రభుత్వం మాత్రం ఊరు మారింది అంటూ ఆర్భాటపు పలుకులతో ప్రకటనలు గుప్పిస్తోంది. క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు పూర్తి భిన్నంగా ఉన్నాయనడానికి మెళవాయి గ్రామమే నిదర్శనం. ఊరిలో అభివృద్ధి ఊసేలేదు. గ్రామ సచివాలయ భవన నిర్మాణం పునాదులకు కూడా నోచుకోలేదు. బిల్లులు అందుతాయో.. లేదోనన్న భయంతో నిర్మాణాలు చేపట్టేందుకు ఎవరూ ముందుకు రాలేదు. దీంతో భవన నిర్మాణం నిమిత్తం వచ్చిన సిమెంటు బస్తాలు గడ్డకట్టి నిరుపయోగంగా పడి ఉన్నాయి. రైతు భరోసా కేంద్రాని(ఆర్బీకే)కి భవనాలు లేకపోవడంతో గ్రామంలోని కమ్యూనిటీ హాల్‌లో నిర్వహిస్తున్నారు. గ్రామ సచివాలయం.. మహిళా సంఘాలకు చెందిన భవనాల్లో నడుపుకోవాల్సిన దుస్థితి నెలకొంది. అందులో కేవలం రెండు గదులు మాత్రమే ఉన్నాయి. ఇరుకు గదుల్లో సచివాలయ సిబ్బంది, పనుల మీద వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం మాత్రం నూతన భవనాలతో గ్రామాల రూపురేఖలు మారిపోయాయంటూ గొప్పలు చెబుతోంది. ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో గ్రామాల్లో అభివృద్ధి పనులు అటకెక్కాయి. డ్రైనేజీ లేక మురుగునీరు రోడ్డుపైనే ప్రవహిస్తోంది. పంచాయతీ కార్మికులకు సకాలంలో వేతనాలు కూడా ఇవ్వట్లేదు. దీంతో వారు పారిశుధ్య పనులు చేపట్టేందుకు అయిష్టత చూపుతున్నారు. వెరసి.. చెత్తతో సంపద తయారీ కేంద్రం నిరుపయోగంగా మారింది. గ్రామంలో ఉన్న ప్రసూతి కేంద్రంలో సరైన వసతులు లేక నిరుపయోగంగా ఉంది. నాడు-నేడు రెండో విడత కింద పాఠశాలలకు సకాలంలో నిధులు రాకపోవడంతో పనులు అర్ధంతరంగా ఆగిపోయాయి. ఇప్పటికైనా సంబంధిత శాఖల ఉన్నతాధికారులు ఆగిపోయిన భవన నిర్మాణాలను పూర్తిచేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

తవ్వేకొద్దీ తప్పులు..!





#	291

CZZ2580918

ఓటరు పేరు : బండమీద గంగమ్మ
భర్త పేరు: రంగప్ప
ఇంటి సంఖ్య : 1-134
వయస్సు : 50 లింగము : స్త్రీ

- ఓటరు తుది జాబితాలోనూ తప్పులు యథాతథం..
- బీఎల్ఓ, ఈఆర్ఓలకు నోటీసులు

పుట్టపర్తి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): 'తప్పులు లేకుండా ఓటరు జాబితా రూపొందిస్తాం. గతంలో విడుదల చేసిన ముసాయిదా జాబితాలో దొర్లిన లోపాలను సవరిస్తామ'ని అధికార యంత్రాంగం చెప్పుకుంది. గతనెల 22న విడుదల చేసిన ఓటర్ల తుది జాబితాలోనూ తప్పులు దొర్లాయి. హిందూపురం నుంచి మడకశిర, కదిరి, ధర్మవరందాకా చాలా గ్రామాల్లో లోపాలు వెలుగుచూస్తూనే ఉన్నాయి. ఓటర్ల ముసాయిదా జాబితాలో సవరణలపై ఎన్నికల సంఘం ఆదేశాలతో ప్రత్యేక శిబిరాలు పెట్టి పోలింగ్ కేంద్రాల వారీగా ఫిర్యాదులు స్వీకరించినా, ఎన్ని సమీక్షలు చేసినా ఓటర్ల చిట్టా అస్తవ్యస్తంగానే మారింది. ఏళ్ల కిందట చనిపోయిన వారి ఓట్లు తుది జాబితాలో ఇంకా కొనసాగుతున్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. మృతులు, డబుల్ ఎంట్రీలు, శాశ్వతంగా వలసపోయిన వారి ఓట్లు తొలగించాలని ఆధారాలతోపాటు ప్రతిపక్ష పార్టీ, ప్రజాసంఘాలు దరఖాస్తులిచ్చినా ఫలితం లేకపోయింది. తప్పులులేని ఓటరు జాబితా కోసం బీఎల్వోలు ఇంటింటికీ వెళ్లి పరిశీలించారు. ప్రత్యేక ఓటరు సవరణ శిబిరాలు ఏర్పాటు చేసి రాజకీయ పార్టీలు ప్రజాసంఘాలతో సమావేశాలు నిర్వహించారు. ఇన్ని చేసినా దోషరహిత ఓటరు జాబితా తయారు చేయడంలో మాత్రం విఫలమయ్యారు. చనిపోయిన వారిని అలాగే ఉంచేసి.. బతికున్న వారి ఓట్లను తొలగించడం వంటి తప్పులు వెలుగు చూస్తున్నాయి. ఈలెక్కన ఆత్మలతోపాటు డబుల్ ఎంట్రీ, శాశ్వతంగా వలస వెళ్లిన ఓటర్లు ఓటేసేందుకు సిద్ధం కావాల్సిందే. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలనే లక్ష్యంతో వైసీపీ వేసిన ఎత్తుగడకు యంత్రాంగం తలూపిందన్న చర్చ సాగుతోంది. ఓటర్ల తుది జాబితాలో తప్పిదాలు వెలుగు చూడడంతో వాటిని సరిదిద్దాలని జిల్లావ్యాప్తంగా పలు మండలాల్లో 74 బీఎల్ఓ, ఈఆర్ఓలకు జిల్లా కలెక్టర్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. గతనెల 24 నుంచి ఈనెల 5వ తేదీదాకా వీటిని అందజేశారు. ఇందులో ధర్మవరం, హిందూపురం, కదిరి, పుట్టపర్తి, పెనుకొండ, మడకశిర నియోజక వర్గాల్లో బీఎల్ఓ, ఈఆర్ఓలు ఉన్నారంటే జాబితాలో తప్పులను ఏమేరకు సరిదిద్దారో తెలుస్తోంది. ఏ పోలింగ్ కేంద్రంలో వెతికినా తప్పులే బయటపడుతుండడం బీఎల్ఓల పనితీరుకు అద్దం పడుతోంది.

ప్రత్యేక శిబిరాలతో ఒరిగిందేంటి?

వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో అడ్డదారుల్లో గెలిచేందుకు అధికార పార్టీ నేతలు విపక్ష ఓట్లపై కన్నేశారన్న చర్చ బహిరంగంగానే సాగుతోంది. టీడీపీ సానుభూతిపరుల ఓట్లను తొలగించే కుట్రలో భాగంగా ఆన్‌లైన్ వేదికగా ఫలానా ఓటరు చనిపోయాడనీ, జాబితా నుంచి తొలగించాలని వెల్లువలా దరఖాస్తులు సమర్పించారు. బీఎల్ఓలపై ఒత్తిళ్లు చేసి దొంగ ఓట్లు నమోదు చేయించారు. అధికార పార్టీ కుట్రలను గుర్తించిన రాష్ట్ర, జిల్లా స్థాయిలో టీడీపీ నేతలు.. కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘాలకు ఫిర్యాదు చేశారు. ఇందులో భాగంగా జిల్లావ్యాప్తంగా ఆరు నియోజకవర్గాల్లో ముసాయిదా ఓటరు జాబితాలో అవకతవకలపై రాష్ట్ర ఎన్నికల సంఘంతోపాటు జిల్లా కలెక్టర్లు, ఆర్డీఓలకు ఆధారాలు, వివరాలతో ఫిర్యాదులు చేశారు. ఈ నేపథ్యంలో 2023 అక్టోబరు 27 నుంచి డిసెంబరు 9 వరకు ప్రత్యేక ఓటర్ల నమోదు, సవరణతో వందశాతం తప్పులు లేకుండా జాబితా రూపొందించేడానికి గతేడాది అక్టోబరులో ముసాయిదా ఓటరు జాబితాను విడుదల చేశారు. నవంబరు 4, 5.. డిసెంబరు 3,4 తేదీల్లో అభ్యంతరాలపై ప్రత్యేక శిబిరాలు నిర్వహించారు. ఈ శిబిరాల్లో ఫారం-6, 7, 8లతో 2024 జనవరి 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతీయువకుల కొత్త ఓటు నమోదు, జాబితాలో చేర్పులు, తొలగింపులు, మృతులు, ఒకే డోర్ నంబరుపై పది ఓట్ల కన్నా ఎక్కువ ఉన్నవాటి పరిశీలన, డబుల్ ఎంట్రీలు, సున్నా డోర్ నంబరు ఓటర్లు, ఒకే రకమైన ఫొటోలు, శాశ్వత వలస వెళ్లిన ఓటర్లపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాల్సి ఉంది. ఇందులో చేర్పులు, తొలగింపులు, ఓటర్ల నమోదుపై ప్రతి పోలింగ్ కేంద్రంలో తప్పనిసరిగా అభ్యర్థనలు, కొత్త ఓటర్ల నమోదు, అభ్యంతరాల వివరాలను బీఎల్ఓలు రిజిస్టర్‌లో నమోదు చేయాలని ఎన్నికల సంఘం సూచించింది. కేంద్ర ఎన్నికల కమిషన్ నిబంధనలు, మార్గదర్శకాల ప్రకారం ఓటర్ల సవరణ జరగలేదనే విమర్శలున్నాయి. తుది జాబితాలో తప్పులు అలానే ఉన్నాయి. తాము దరఖాస్తులు అందించడం కారణంగా ఒనగూరిన ప్రయోజనం ఏమిటంటూ ఆవేదన వెలిబుచ్చుతున్నారు.



సవరణ తూచ్..

నల్లమాడ మండలం మీసాలవాండ్లపల్లిలో పదో తరగతి విద్యార్థిని కె. ప్రసన్నను ఓటరు జాబితాలో నమోదు చేశారు. ఈ అంశం వెలుగులోకి రావడంతో విద్యార్థిని తండ్రిపై తహసీల్దార్ పోలీలకు ఫిర్యాదు చేశారు. హిందూపురం మండలం మణేసముద్రంలోని ఒకటో పోలింగ్ కేద్రంలో వరుస సంఖ్య 17లో ఓటరు పేరు, తండ్రి పేరు, వయసు సక్రమంగా ఉన్నా.. ఇంటి నంబరు స్థానంలో ఊరుపేరు ఉంది. జిల్లావ్యాప్తంగా చాలా పోలింగ్ కేంద్రాల్లో ఇలాంటి పరిస్థితి ఉంది. కనసగానిపల్లి మండలం ఎలకుంట్ల పరిధి 188 నంబరు పోలింగ్ కేంద్రంలో ఇంటి నంబరు 6-12తో వరుస సంఖ్య 98, 218, 1001లో సాయి అరవింద్‌రెడ్డి కొమ్మూరు పేరుతో మూడు ఓట్లు అలాగే ఉన్నాయి. రెండుచోట్ల తొలగించాలని బీఎల్వోలకు విన్నవించినా.. తుది జాబితాలో మార్పు చేయలేదంటే పరిశీలన ఎలా చేశారో తెలుస్తోంది. అమరాపురం మండలం గౌడనకుంటలో మృతిచెందిన వారి పేర్లు తొలగించకపోవడంతో ఒక్కోపోలింగ్ కేంద్రంలో 10కిపైగా మృతుల ఓట్లు అలాగే ఉన్నాయి. ఇదే గ్రామంలో వివాహమై అత్తారింటికి వెళ్లిన మహిళల పేర్లు జాబితాలో కొనసాగుతున్నాయి. పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధి 95వ పోలింగ్ కేంద్రంలో తుది జాబితాలో 19 మంది ఓటర్లు అలాగే ఉన్నారు. కదిరిలోని 79వ పోలింగ్ కేంద్రంలో మహబూబ్ బాషా, మునిస్వామి మృతి చెందారు. వారి ఓట్లు తొలగించాలని ఫిర్యాదులు అందినా అలాగే ముద్రించారు. ధర్మవరం మున్సిపాలిటీ 225 పోలింగ్ కేంద్రంలో 25-517-6లో ఉమామహేష్ పసల మృతిచెందినా ఓటర్ల జాబితాలో కొనసాగుతోంది. హిందూపురం పట్టణం పదో వార్డులో కొందరి ఓటర్ల పేర్లు కన్నడలో ముద్రించారు. ఇదే వార్డులో 8-1-15 ఇంటి నంబరులో శ్రీనివాసరావు, కస్తూరీబాబు దంపతులు పదేళ్ల కిందటే విదేశాలకు వెళ్లారు. అయినా వారి ఓట్లు జాబితాలో ఉండడం గమనార్హం. ఇలా తుది జాబితాలో ప్రతి పోలింగ్ కేంద్రంలో తప్పులు కుప్పలుగా ఉన్నాయి.

రక్షణ గాలికి..!



పెన్నానది వంతెన వద్ద ప్రమాదకర మలుపు

హిందూపురం పట్టణ సమీపాన మోతుకపల్లి వద్ద పెన్నా నదిపై వంతెన శిథిలావస్థలో ఉండేది. గుంతలతో నిండిన ఇరుకైన ఆ వంతెనపై తరచూ ప్రమాదాలు జరుగుతుండేవి. దీంతో జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) పాత బ్రిడ్జి పక్కనే ఏడాది క్రితం కొత్తగా వంతెన నిర్మించారు. అయినా.. వాహనదారులకు ప్రమాద భయం మాత్రం తప్పలేదు. మరింత పెరిగింది. కొత్త వంతెన, రోడ్డు విశాలంగా ఉందని వాహనదారులు వేగంగా వస్తే మాత్రం.. ప్రమాదం మలుపు రూపంలో అక్కడే పొంచి వేసింది. వంతెన వద్ద పెద్ద మలుపు ఉంది. వాహనదారులు ఏమాత్రం అప్రమత్తంగా లేకపోయినా.. 20 అడుగుల లోతైన ప్రాంతంలోకి పడిపోయే ప్రమాదం ఉంది. అదేప్రాంతంలో వారం రోజుల క్రితం కారు, ద్విచక్రవాహనం ఢీకొన్నాయి. కొత్త రోడ్డు, వంతెన వేశారు కానీ, రక్షణ ఏర్పాట్లు మాత్రం మరిచారు. మలుపు వద్ద సూచిక బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదు. రోడ్డు పక్కనే సేఫ్టీవాల్ నిర్మించాల్సి ఉంది. వేగంగా వచ్చే వాహనదారులు అతి సమీపంలోకి వచ్చాక పెద్ద మలుపును చూసి భయకంపితులౌతున్నారు. ఆ దారిలో నిత్యం ద్విచక్ర వాహనాలు, లారీలు, బస్సులు అధిక సంఖ్యలో తిరుగుతుంటాయి. గొర్రెపల్లి వద్ద ఫీకాట్ మిల్లు, పరిగి, కాలువపల్లి వద్ద గార్మెంట్ పరిశ్రమలు ఉన్నాయి. దీంతో వేలాదిమంది మహిళా కార్మికులు రోజూ బస్సుల్లో ఈ వంతెన మీదుగానే రాకపోకలు సాగిస్తుంటారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు మేల్కొని రోడ్డు పక్కన సేఫ్టీవాల్స్, ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాల్సి ఉంది.

-హిందూపురం అర్బన్



సేఫ్టీవాల్స్ ఏర్పాటు చేయాల్సిన దృశ్యం

ఎంపీపీపై ఉపసర్పంచ్ దాడి

- ఆయన చాంబర్‌లోనే దౌర్జన్యం
- నానా దుర్భాషలు
- జగనన్న మైనార్టీలకు పదవులిచ్చాడు తప్ప.. అధికారాలివ్వలేదు
- ఎంపీపీ ఆవేదన
- న్యాయం చేయాలని పోలీసులకు ఫిర్యాదు



ఆవేదన వ్యక్తం చేస్తున్న ఎంపీపీ రఫీనాయక్

కదిరి, ఫిబ్రవరి 6: వైసీపీ తలుపుల ఎంపీపీ రఫీనాయక్‌పై మంగళవారం ఆయన చాంబర్‌లోనే అదే పంచాయతీ ఉపసర్పంచ్ డి కృష్ణారెడ్డి అలియాస్ డీకే బాబు దాడి చేశాడు. దాడిపై కదిరి రూరల్ పోలీసులకు ఎంపీపీ ఫిర్యాదు చేశారు. ఆయన వెల్లడించిన వివరాలివి. తలుపులలో టెక్నికల్ అసిస్టెంట్ (టీఏ)గా పనిచేస్తున్న మోహన్‌ను మూడునెలల క్రితం ముదిగుబ్బకు బదిలీ చేశారు. అక్కడి నుంచి గాండ్లపెంటకు ట్రాన్స్‌ఫర్‌పై పంపారు. అక్కడి నుంచి తిరిగి తలుపులలో టెక్నికల్ అసిస్టెంట్‌గా రెండ్రోజుల క్రితం చేరాడు. దీనిపై తనకు కనీస సమాచారం ఇవ్వలేదని ఎంపీపీ రఫీనాయక్ ఆవేదన చెందారు. జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబుకు సోమవారం స్పందనలో ఫిర్యాదు చేశారు. విషయాన్ని టీఏ.. ఉప సర్పంచ్ డీకే బాబుకు తెలిపాడు. తన వర్గానికి చెందిన టీఏపై ఫిర్యాదు చేయడాన్ని ఉపసర్పంచ్ జీర్ణించుకోలేకపోయాడు. ఈ నేపథ్యంలో తలుపుల ఎంపీడీఓ కార్యాలయంలోని తన చాంబర్‌లో ఉండగా.. డీకే బాబు తన అనుచరులు ప్రభువర్ధన్, రమేష్‌బాబుతో కలిసి వచ్చి, బూతులు తిడుతూ చొక్కాపట్టుకుని దాడిచేశారని ఎంపీపీ ఆవేదన చెందారు. కార్యాలయంలోని కుర్చీలు, ఇతర సామగ్రిని చెల్లాచెదురుగా పడేశారని వాపోయారు. గతంలో కూడా డీకే బాబు అధికారులు, ప్రజాప్రతినిధులపై పలుమార్లు దాడులు చేశారన్నారు. జగనన్న మైనార్టీలకు పదవులిచ్చాడే తప్ప.. అధికారం ఇవ్వలేదని ఎంపీపీ వాపోయారు. ఎంపీపీనైన తనపై తన కార్యాలయంలోనే దాడి చేస్తే సామాన్యుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. డీకే బాబుపై చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు పోలీసు వర్గాల సమాచారం.

10న 'ఇన్‌స్పైర్' ఎగ్జిబిషన్

అనంతపురం విద్య, ఫిబ్రవరి 6 : 'ఇన్‌స్పైర్ 2022-23 అవార్డ్స్ ఎగ్జిబిషన్ ఈ నెల 10వ తేదీ నగర శివారులోని రాప్తాడు మోడల్ స్కూల్‌లో నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ డీఈఓ నాగరాజు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో ఇన్‌స్పైర్ అవార్డులు పొందిన స్కూల్స్ ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు విద్యార్థులతో ఎంపికైన ప్రాజెక్టుల నమూనాలు తయారు చేయించి ఎగ్జిబిషన్‌లో పాల్గొనాలన్నారు. జిల్లావ్యాప్తంగా 103 ప్రాజెక్టులు ఎంపికయ్యాయని, ఆయా స్కూళ్ల నుంచి విద్యార్థులు, గైడ్ టీచర్లు తప్పనిసరిగా ఎగ్జిబిషన్‌లో పాల్గొనాలని సూచించారు. సమాచారం, సందేహాల నివృత్తి కోసం జిల్లా సైన్స్ ఆఫీసర్ బాలమురళికృష్ణను సంప్రదించాలని తెలిపారు.

ప్రచారాలను నమ్మకండి : డీఐపీఆర్ఓ

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 6: విలేకరులకు ప్రభుత్వం మంజూరు చేస్తున్న ఇంటి స్థలాల విషయంలో సోషల్‌మీడియా ప్రచారాలను నమ్మవద్దని జిల్లా పౌరసంబంధాలశాఖ పీఆర్ఓ గురుస్వామిశెట్టి మంగళవారం ఓప్రకటనలో కోరారు. ఇప్పటికీ రెవెన్యూశాఖలో దరఖాస్తుల పరిశీలన జరుగుతోందని, పరిశీలన తర్వాతే అర్హుల జాబితాను ప్రకటిస్తామని తెలిపారు. ఎలాంటి వదంతులను నమ్మవద్దని ఆయన జర్నలిస్టులను కోరారు.

ప్రాక్టికల్స్‌కు 21 మంది గైర్హాజరు

అనంతపురం విద్య, ఫిబ్రవరి 6: ఇంటర్ ఒకేషనల్ ప్రాక్టికల్స్‌కు 21 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఇంటర్ ఎగ్జామ్స్ కన్వీనర్ వెంకటరమణ నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 349 మందికిగాను 335 మంది హాజరుకాగా 14 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని, మధ్యాహ్నం 245 మంది విద్యార్థులకు గాను 238 మంది హాజరు కాగా మరో 7 మంది విద్యార్థులకు ప్రాక్టికల్స్‌కు హాజరుకాలేదన్నారు. ఆయన గార్లదిన్నె కేజీబీవీ, బుక్కరాయసముద్రం కేజీబీవీలను తనిఖీ చేశారు.

స్మగ్లర్ల వేటలో వీరమరణం

- అన్నమయ్య జిల్లాలో ధర్మవరం కానిస్టేబుల్ మృతి
- ఎర్రచందనం కారుకు అడ్డుగా వెళ్లిన వైనం
- వాహనం మీదికే వస్తున్నా.. వెనక్కి తగ్గని ధీరత్వం
- ఢీకొట్టి.. మీదుగా కారును తోలిన దుండగులు..
- అక్కడికక్కడే మృతి... కన్నీరుమున్నీరైన కుటుంబికులు



గణేశ్ మృతదేహం వద్ద విలపిస్తున్న అతడి భార్య అనూష



కానిస్టేబుల్ గణేశ్ (ఫైల్)

పీలేరు/ధర్మవరం, ఫిబ్రవరి 6: ఎర్రచందనం స్మగ్లర్ల వేటలో శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణంలోని గుట్టకిందపల్లి ప్రాంతానికి చెందిన ఏఆర్ కానిస్టేబుల్ గణేశ్ (30) వీరమరణం పొందారు. అన్నమయ్య జిల్లా కేవీపల్లె మండలం ఎంవీపల్లె పంచాయతీ చెరువుముందర గుండ్రేవారిపల్లె గ్రామ స మీపంలోని గొల్లపల్లె చెరువు వద్ద మంగళవారం తెల్లవారుజామున ఎర్రచం దనం స్మగ్లింగ్‌ను అడ్డుకోబోయి వారి చేతిలో బలయ్యాడు. టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యుడైన గణేశ్.. స్మగ్లర్ల కారుకు అడ్డంగా వెళ్లారు. కుడి వైపు నుంచి న లుగురు సిబ్బంది రాగా.. ఎడమ వైపు నుంచి గణేశ్ ఒక్కరే కారుకు అడ్డుగా వచ్చా రు. బరితెగించిన స్మగ్లర్లు కారును ఆపినట్లే ఆపి.. వేగంగా గణేశ్ ఉన్న వైపు పోని చ్చారు. ఏమాత్రం భయపడకుండా గణేశ్ అలానే కారుకు అడ్డంగా వచ్చారు. కాని స్టేబుల్‌ను గుద్దేసి.. ఆయన మీదుగా కారు పోనిచ్చారు. దీంతో గణేశ్ తీవ్రంగా గాయపడ్డారు. పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలి స్తుండగా మార్గమధ్యలో ప్రాణాలు వదిలారు.

మేమంతా వచ్చాం.. లే గణేశ్..

గణేశ్ మృతి విషయం తెలియగానే కుటుంబికులు, బంధువులు పీలేరు ఆస్పత్రికెళ్లారు. వారి ఆర్తనాదాలతో ఆస్పత్రి ప్రాంగణం దద్దరిల్లిపోయింది. 'నాకేమీ కాదు, నేను బాగానే ఉన్నాను, తెల్లారగానే ఇంటికి వచ్చేస్తానని చెబితివి కదా, మేమంతా వచ్చాం, లే గణేశ్ అంటూ ఏఆర్ కానిస్టేబుల్ మృతదేహంపై పడి అతడి భార్య అనూష పెట్టిన ఆర్తనాదాలు అక్కడున్న వారందరి కళ్లల్లో నీళ్లు తెప్పించాయి. గణేశ్‌కు ఇద్దరు కుమారులు రాజ్‌కిశోర్ (6), వేదాన్ష్ (2) ఉన్నారు. నిస్తేజంగా పడుకుని ఉన్న తండ్రిని, కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న తల్లిని అమాయకంగా ఆ ఇద్దరు చూడడం అందరినీ కలచి వేసింది. బిల్లే శ్రీరాములు, అలివేళమ్మ దంపతులకు ఏకైక కుమారుడు గణేశ్ కాగా.. ముగ్గురు కుమార్తెలున్నారు. 8 ఏళ్ల క్రితం తండ్రి మృతిచెందారు. గణేశ్‌కు రామగిరి మండలం పెనుబోలు గ్రామానికి చెందిన అనూషతో వివాహమైంది. గణేశ్ అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ.. బంధువులందరిలోనూ మంచి వ్యక్తిగా మెలిగేవారని స్థానికులు చెబుతున్నారు. గణేశ్ మృతదేహాన్ని మంగళవారం రాత్రికి స్వగ్రామానికి తేనున్నట్లు బంధువులు తెలిపారు. బుధవారం గుట్టకిందపల్లి వద్ద పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

29లోగా దుకాణాల రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

- కార్మికశాఖ ఉపకమిషనర్ లక్ష్మీనరసయ్య

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 6 : దుకాణాలు, వాణిజ్య సముదాయాలను కార్మికశాఖద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకునే ప్రక్రియను ఈనెల 29వ తేదీలోపు పూర్తి చేయాలని జిల్లా కార్మికశాఖ ఉప కమిషనర్ లక్ష్మీనరసయ్య పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం జిల్లా కార్మికశాఖ కార్యాలయంలో నగరంలోని దుకాణదారులు, వాణిజ్య సముదాయాల నిర్వాహకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దుకాణాలకు కార్మికశాఖ రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ పొందాలన్నది గతంలో ఉన్న ప్రక్రియేనని, అయితే చాలామంది అవగాహనాలోపం వల్ల రిజిస్ట్రేషన్ చేయించుకోక జరిమానాలు చెల్లించాల్సి వస్తోందన్నారు. గతంలో మ్యానువల్‌గా ఉన్న రిజిస్ట్రేషన్ ప్రక్రియను 2015 నుంచి ఆన్‌లైన్ ద్వారా మీసేవ కేంద్రాల ద్వారా పొందేలా చట్టం చేసిందన్నారు. దుకాణదారులు, వాణిజ్య సముదాయాల నిర్వాహకులు సమీపంలోని మీసేవ కేంద్రాల్లో సంప్రదించి కార్మికశాఖ రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ పొందవచ్చునన్నారు. వ్యాపారులకు ఇది సువర్ణ అవకాశమన్నారు. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కార్యదర్శి రంగారెడ్డి, మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పిన్ని నాగరత్నం, క్లాత్స్ అసోసియేషన్ అధ్యక్షుడు హితేన్ జైన్, హోటల్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రమణ, జ్యువెలరీ అసోసియేషన్ ప్రతినిధి సయ్యద్, కార్మికశాఖ ఏఎల్ఓలు రాధా రమాదేవి, శ్రీవాణి, సుజాత తదితరులు పాల్గొన్నారు.



రైల్వే స్టేషన్ ముఖద్వారం

కొత్త సమస్యలు..!



- అనంత రైల్వే స్టేషన్లో ముందుకు సాగని అభివృద్ధి పనులు
- అసౌకర్యాలతో ప్రయాణికులు విలవిల
- డీఆర్ఎం ఆదేశించినా డోన్ట్ కేర్..



తాళం వేసిన విశ్రాంత గదులు

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి6: జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్‌లో 'కొత్త' సమస్యలు ప్రయాణికులను పీడిస్తున్నాయి. ఒకటి కాదు..రెండు కాదు..అన్నింటినీ మార్చేశారు.. ప్రధాన ద్వారం.. ప్లాట్‌ఫారం నెంబర్లు.. వెయిటింగ్ రూంలు.. ఇలా అన్నీ కొత్తవే. కానీ ఇక్కడే అసలు సమస్య తలెత్తుతోంది. పలు పనులు పెండింగ్‌లో ఉండగానే ఆర్భాటంగా ప్రా రంభించారే తప్ప, ఇబ్బందులు పట్టించుకోవడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. దీనికి తోడు నిర్వాహణ సమస్యలతో ఉన్న వసతులను సైతం వినియోగంలోకి తీసుకురాక పోవడంతో మరిన్ని ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

- రైల్వే స్టేషన్‌ను ఆధునీకరించి ప్రస్తుతం ఉన్న మార్గం నుంచి కాకుండా 1వ రోడ్డు నుంచి రాకపోకలు సాగించేలా ప్రధాన ద్వారం ఏర్పాటు చేశారు. అయితే ఈ నిర్మాణ పనులు కొన్ని సంవత్సరాలుగా జరుగుతున్నాయి. కాంట్రాక్టర్‌కు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతోనే.. పనులపై ఆసక్తి కొరవడిందని అంటున్నారు. అరకొర పనులు పూర్తి అయినప్పటికీ భవనాలను వినియోగంలోకి తీసుకొస్తే.. బిల్లుల చెల్లింపునకు మార్గం సుగుమం అవుతుందన్న ఆలోచనతో అధికారులు హడావుడిగా ప్రారంభించేశారు. పాత భవనాలను ఖాళీ చేస్తున్నా, కొత్త భవనాల్లో సదుపాయాలు కొరవడ్డాయి.

- కొన్ని ప్రాంతాల్లో పూర్తి స్థాయిలో వినియోగంలోకి వచ్చే లోపే అవి శిథిలావస్థలకు చేరుకొనే దుస్థితి నెలకొంది. గతంలో 1వ ప్లాట్‌పామ్‌గా ఉన్న ప్రధాన ద్వారాన్ని 4వ ప్లాట్‌పామ్‌గా మార్చారు. అయితే గుత్తి నుంచి వచ్చే రైళ్లు 4వ ప్లాట్‌పామ్, ధర్మవరం మీదుగా వచ్చే రైళ్లు 1,2 ప్లాట్‌పామ్స్ మీదుగా రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో ఆ మార్గాలు ఉపయోగించక తప్పడం లేదు.

ప్రయాణికులకు తప్పని తిప్పలు

రైల్వే స్టేషన్‌లో ఎక్కువ శాతం పాత ముఖద్వారం ద్వారానే రాకపోకలు సాగిస్తున్నారు. దీనికి ప్రధాన కారణం రైళ్లు దిగిన ప్రయాణికులకు పట్టణంలోకి రావడం, బస్టాండ్ వెళ్లాలన్నా ఈ మార్గమే అనుకూలంగా ఉంటుంది. నూతన మార్గం కొంత ఇబ్బందికరంగా మారింది. దీనికి తోడు నిర్మాణాలు పూర్తి కాకపోవడంతో అవకాశం ఉన్నవారు కూడా ఆమార్గం నుంచి రాలేని పరిస్థితి ఏర్పడింది. ఇక దివ్యాంగులు, వృద్ధుల పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారింది. ప్రస్తుతం స్టేషన్‌లో ఉన్న లిఫ్ట్ ఎప్పుడు పని చేస్తుందో.. ఎప్పుడు మొండికేస్తుందో అధికారులకే తెలియదు.



పని చేయని లిఫ్ట్

ఉన్న వసతులను వినియోగంలోకి తీసుకురారు

రైల్వే స్టేషన్ ఆవరణంలో కొన్ని నిర్మాణాలు పూర్తి అయ్యాయి. అయితే నిర్వహణా భారంతో వాటిని అందుబాటులోకి తీసుకు రావడం లేదు. పాత స్టేషన్ గదుల వద్దే ప్రస్తుతం సిబ్బంది ఉన్నారు. వాటిని వదిలి కొత్తవాటి వద్దకు రాలేని పరిస్థితి.. దీనికి తోడు అవసరాలకు అనుగుణంగా సిబ్బందిని నియమించలేదు. స్లీపర్, ఉన్నత శ్రేణి, సాధారణ ప్రయాణికులకు సంబంధించి విశ్రాంతి గదులు అన్ని హంగులతో పూర్తి చేశారు. అయితే వాటిని అలా గాలికి వదిలేయడంతో ఆక తాయిలు అడ్డాగా మార్చుకున్నారన్న విమర్శలు వినిపిస్తు న్నాయి.

పనులు వేగవంతం చేయాలి : వినీత్‌సింగ్, డీఆర్ఎం

డీఆర్ఎం వినిత్‌కుమార్ సింగ్ ఇటీవల అనంత రైల్వే స్టేషన్‌ను పరిశీలించారు. రెండు గంటల పాటు పర్యటించిన ఆయన అభివృద్ధి పనుల జాప్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పనులను వేగంగా పూర్తి చేసి ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని, స్టేషన్‌ను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. మందుబాబులకు ఆశ్రయం లేకుం డా చూడాలని స్టేషన్ మేనేజర్ అశోక్‌ను ఆదేశించారు.



అపరిశుభ్రంగా మారిన స్టేషన్ ఆవరణ

నిర్వహణ కష్టంగా మారింది.. : అశోక్‌కుమార్, స్టేషన్ మేనేజర్



స్టేషన్‌లో ప్రయాణికులకు పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించడం కష్టతరంగా మారింది. పనులు జరుగుతుండంతో ప్రయాణి కులకు ఇబ్బందికర పరిస్థితులు తలెత్తుతున్నాయి. విశ్రాంతి గదుల్లో ఉన్న సామగ్రిని గుర్తు తెలియని ఆకతాయిలు ధ్వంసం చేశారు. వీలైనంత త్వరగా నిర్మాణాలు పూర్తి చేసి పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పిస్తాం. ప్రయాణికులు అధికారులకు సహకరించాలి.

ఆర్టీసీ బస్సు ఢీ.. హోంగార్డు మృతి

విధులు ముగించుకుని ఇంటికి వెళ్తుండగా ప్రమాదం



బైకును ఢీకొన్న ఆర్టీసీబస్సు



హోంగార్డు నాగప్ప(ఫైల్)

ధర్మవరం రూరల్/ చెన్నేకొత్తపల్లి, ఫిబ్రవరి 6: ఆర్టీసీ బస్సు ఢీకొని హోంగార్డు దుర్మరణం చెందారు. కనగానపల్లి పోలీసులు తెలపిన వివరాల మేరకు మండలంలోని యలకుంట్ల క్రాస్ వద్ద ఆర్టీసీ బస్సు ఢీకొని హోంగార్డు దుర్మరణం చెందిన సంఘటన మంగళవారం తెల్లవారు జామున జరిగింది. చెన్నేకొత్తపల్లి పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న హోంగార్డు వీ.నాగప్ప(40) సోమవారం రాత్రి మండలంలోని తూంచర్ల లో జరుగుతున్న దేవర ఉత్సవాలకు బందోబస్తుకు వెళ్లారు. విధులు ముగించుకుని తెల్లవారుజామున తన ద్విచక్రవాహనంలో ధర్మవరం వైపు వస్తున్నారు. ధర్మవరం వైపు నుంచి వేపకుంటకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు యల్లకుంట్ల క్రాస్ వద్ద ముందు వెళ్తున్న ఎద్దులబండిని తప్పించబోయి ఎదురుగా వస్తు న్న ద్విచక్రవాహనాన్ని వేగంగా ఢీకొట్టింది. దీంతో ద్విచక్రవాహనంతో పాటు బస్సుకింద పడ్డ హోంగార్డు నాగప్ప తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే కన్ను మూశారు. మృతుడికి భార్య యశోదతో పాటు ముగ్గురు కుమారులు ఉన్నారు. మృతుడి స్వగ్రామమైన మేడాపురం గ్రామస్థులు, బంధువులు అక్కడికి చేరుకుని బోరున విలపించారు. ఈ వి షయం తెలుసుకున్న కనగానపల్లి ఎస్ఐ మల్లికార్జునరెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. నాగప్ప మృతిపై తోటి సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు.

డీఎస్పీ నివాళి

హోంగార్డు అకాలంగా మృతి చెందడం బాధాకరమని ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులు పేర్కొన్నారు. రోడ్డు ప్రమాద విషయం తెలుసుకున్న ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులు మృతుడి స్వగ్రామమైన మేడాపురం వెళ్లి భౌతిక కాయానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం కుటుంబసభ్యులకు రూ.25 వేలు ఆర్థికసాయం అందించారు. ఉన్నతాధికారుల దృష్టికితీసుకెళ్లి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. నివాళులర్పించిన వారి లో ఎస్ఐ శ్రీధర్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

ఎంబీఏ, ఎంసీఏ ఫలితాలు విడుదల

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 6: జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంబీఏ, ఎంసీఏ పరీక్షల ఫలితాలు మంగళవారం విడుదల చేశామని డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ ప్రొఫెసర్ కేశవరెడ్డి, సీఈ ప్రొఫెసర్ చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. ఎంసీఏ తృతీయ సెమిస్టర్(ఆర్20) రెగ్యులర్, సప్లమెంటరీ పరీక్షలతో పాటు ఎంబీఏ తృతీయ సెమిస్టర్(ఆర్21), నాల్గవ సెమిస్టర్(ఆర్21,17) ఎంసీఏ తృతీయ, నాల్గవ సెమిస్టర్(ఆర్20,17), ఐదవ సెమిస్టర్(ఆర్17) పరీక్షలను నిర్వహించారు. ఫలితాలకోసం www.jntua.ac.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

యువకుడి ఆత్మహత్య



రంజిత్ (ఫైల్)

పుట్టపర్తి రూరల్, ఫిబ్రవరి 6: ప్రేమించిన యువతి దక్కలేదని రంజిత్ (24) అనే యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డారు. రూరల్ పోలీసులు తెలిపిన మేరకు పుట్టపర్తి మండలం వీరాంజినేయపల్లిలో మంగళవారం వీరాంజినేయలపల్లికి చెందిన నారాయణ పెద్దకుమారుడు రంజిత్ పుట్టపర్తిలో వెల్డింగ్ పనిచేసుకుని జీవనం సాగించే వాడు. ఈ క్రమంలో ఓయువతిని ప్రేమించాడు. ఐతే యువతి తల్లిదండ్రులు ప్రేమను అంగీకరించలేదనే మనస్థాపంతో మంగళవారం తెల్లవారుజామున ఇంట్లో ఫ్యాన్‌కు తాడుతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. తెల్లవారుజామున ఎంతటికీ తలుపు తెరవకపోవడంతో తండ్రి అనుమానంతో తలుపులు పగులకొట్టి చూడగా రంజిత్ ఫ్యానుకు వేలాడుతూ కనిపించాడు. స మాచారం అందుకున్న రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఆలయ భూములనూ అమ్మేశారు..

- నకిలీ పట్టాలు సృష్టించిన వైసీపీ నాయకులు
- ఇంటి నిర్మాణానికి అనుమతినిచ్చిన రెవెన్యూ అధికారులు

ఉరవకొండ, ఫిబ్రవరి 6: వైసీపీ నాయకులు ఆలయ భూములనూ వదలకుండా కబ్జా చేశారు. పట్టణంలోని సర్వే నెంబర్ 563లోని వీరభద్రస్వామి ఆలయ భూమికి నకిలీ పట్టాలను సృష్టించి, అమాయకుల్ని నమ్మించి, పాట్లు విక్రయించి సొమ్ము చేసుకున్నారు. పట్టాల్లో కూడా వేరే సర్వే నెంబర్‌ను పొందుపరిచి, సర్వే నెంబర్ 563లో స్థలాలను చూపించారు. ఇప్పటికే ఆ భూమిలో 20మంది దాకా ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. హౌసింగ్ అధికారులు సైతం ఆ భూములకు ఇళ్లు మంజూరు చేయడం ఆశ్యర్యమే. పంచాయతీ అధికారులు ఇళ్ల నిర్మాణాలకు అనుమతులివ్వడం కొసమెరుపు. ఇదే కాకుండా సర్వే నెంబర్ 564లో పంచాయతీ ప్రజల కోసం కేటాయించిన స్థలంపై వైసీపీ నాయకులు కన్నేసినట్లు తెలుస్తోంది. ఆ స్థలం జాతీయ రహదారికి ఆనుకుని ఉండటంతో సెంటు రూ.10లక్షల దాకా పలుకుతోంది. పంచాయతీ స్థలాలు అన్యాక్రాంతమవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.



దేవాలయభూమిలో నిర్మించిన ఇల్లు

అమ్మేసిన పంచాయతీ స్థలం ఇదే

పంచాయతీ స్థలం రిజిస్ట్రేషన్

ఉరవకొండ మేజర్ పంచాయతీ పరిధిలో ప్రజా ప్రయోజనాల కోసం వదిలిన స్థలాన్ని విక్రయించి, ఏకంగా రిజిస్ట్రేషన్ చే యించారు. ఉరవకొండలోని సర్వే నెంబర్ 598-బీలో పంచాయతీకి చెందిన స్థలం ఉంది. అందులో 3.75సెంట్లు కలిగిన ప్లాట్ తమదేనంటూ 2014లో విడపనకల్లు మండలం ఆర్. కొట్టాలకు చెందిన ఓ మహిళకు విక్రయించారు. దీనికి మ ధ్యవర్తిగా వైసీపీకి చెందిన వ్యక్తి వ్యవహరించారు. ఆ స్థలాన్ని రూ.4.80 లక్షలకు అమ్మి ఆ మహిళ పేరుతో రిజిస్ట్రేషన్ చేయించారు. కొన్నాళ్ల తర్వాత కొనుగోలు చేసిన మహిళ స్థలం వద్దకు వెళ్లగా పంచాయతీ స్థలం అని తేలింది. దీంతో తమకు డబ్బులు తిరిగి ఇవ్వాలని లేదా స్థలం చూపించాలని వారిని అడిగారు. పోలీస్‌స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేశారు. 10నెలలైనా రిజిస్ట్రేషన్ ఆఫీసులో తొలగించలేదు. పంచాయతీ అధికారులు బోర్డులు పెట్టి చేతులు దులుపుకున్నారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి గౌస్‌ను వివరణ కోరగా అమ్మిన, కొనుగోలు చేసిన వారికి త్వరలోనే నోటీసులు పంపుతామని తెలిపారు.

రాయలసీమకు తీరని అన్యాయం

- ప్రత్యేక నిధులు కేటాయించి ప్రాజెక్టులను పూర్తి చేయాలి : సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి



మాట్లాడుతున్న బొజ్జా దశరథరామిరెడ్డి

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి6 : రాయలసీమకు ఇచ్చిన ఏ హామీని నెరవేర్చకుండా ఆ ప్రాంత ప్రజలకు సీఎం జగన్ తీరని అన్యాయం చేస్తున్నారని రా యలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి మండిపడ్డారు. మంగళవారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో జలసాధన సమితి ఆధ్వర్యంలో పలు రాజకీయ, రైతు సంఘాలతో చర్చావేదిక నిర్వహించారు. జలసాధన సమితి అధ్యక్షుడు రామ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన చర్చావేదికలో బొజ్జా దశరథరామిరెడ్డి మాట్లాడుతూ.. సీఎం జగన్ ఆమోదించి, ప్రారంభించిన హంద్రీనీవా కాలువ వెడల్పు, తోపుదుర్తి, ముట్టాల, దేవరకొండ రిజర్వాయర్లు, పుట్టపర్తిలోని 193 చెరువులు ముదిగుబ్బ మండలం జిల్లేడు బండ ప్రాజెక్టు, మడకశిర బ్రాంచ్ కెనాల్ బైపాస్ కెనాలు, మడకశిర నియోజకవర్గంలో కాలువ పనులు పూర్తీ చేయడానికి రూ. 8709 కోట్లు ఖర్చవుతోంది. అయితే 2023-24 బడ్జెట్‌లో కేవలం హంద్రీనీవాకు రూ. 122.69 కోట్లు కేటాయించి అన్యాయం చేశారన్నారు. ఈ బడ్జెట్‌తో ప్రాజెక్టులను ఏ విధంగా పూర్తి చేస్తారో సమాధానం చెప్పాలన్నారు. రాయలసీమ ప్రాజెక్టులకు బడ్జెట్‌లో అతి తక్కువ కేటాయింపులు చేయడం, కోస్తాంధ్ర ప్రాంతానికి అధిక కేటాయింపు చేయడంలో సమన్యాయం ఎక్కడుందో చెప్పాలని ప్రశ్నించారు. జగన్ అధికారంలోకి వచ్చాక హంద్రీనీవా కాలువ పనులు ఎక్కడివక్కడ ఆగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబు ప్రారంభించిన పేరూరు, భైరవానితిప్ప ప్రాజెక్టులను రద్దు చేశారన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లా కరువులు, వలసలు, రైతుల ఆత్మహత్యలతో అల్లాడిపోతుందన్నారు. ఈ పరిస్థితుల్లో సంక్షేమ పథకాలు ఉపశమనమే తప్ప.. శాశ్వత కరువు నివారణ పథకాలు కావన్నారు. ఉమ్మడి జిల్లా కరువు నివారణకు హంద్రీనీవా ప్రాజెక్టును యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి బీడుపడిన భూములకు సాగునీరందించడమే పరిష్కారమన్నారు. జీఓ నెం 365తో హంద్రీనీవా, గాలేరునగరి, తెలుగుగంగ తదితర రాయలసీమ ప్రాజెక్టులలో దాదాపు కాలువలు, ప్యాకేజీలు 100కిపైగా రద్దు చేసి సీఎం జగన్ రాయలసీమకు తీరని అన్యాయం చేశారని మండిపడ్డారు. రైతులు కరువును గట్టెక్కాలంటే 2021లో పరిపాలన ఆమోదం పొందిన హంద్రీనీవా మెయిన్ కాలువను వెడల్పు చేయాలని, హంద్రీనీవా సమాంతర కాలువను నిర్మించి 6,02,500 ఎకరాల ఆయకట్టుకు పిల్ల కాలువల ద్వారా నీరందించాలన్నారు. తుంగభద్ర నది నుంచి సమాంతర కాలువ నిర్మించడంతో పాటు.. మండకశిర బ్రాంచ్ కెనాల్ వెడల్పు చేయాలన్నారు. రాయలసీమ ప్రాజెక్టులకు ప్రథమ ప్రాధాన్యమిస్తూ బడ్జెట్ కేటాయించా లన్నారు. బడ్జెట్‌లో రాయలసీమ ప్రాజెక్టులకు 50 శాతం ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. ఈ చర్చావేదికలో మాజీ ఎమ్మెల్సీ గేయానంద్, హెచ్ఆర్ఎఫ్ నాయకులు చంద్రశేఖర్, ఓపీడీఆర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, రచయిత బండి నారాయణస్వామి, ఇండ్ల ప్రభాకర్ రెడ్డి, రైతు సంఘం నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్సీఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి పాల్గొన్నారు.

పేట్రేగిపోతున్న దొంగలు

- పొలాల్లోని పరికరాలే టార్గెట్
- ఇటీవల ఆరు ఇళ్లలో చోరీ
- అరికట్టడంలో పోలీసుల విఫలం

ధర్మవరంరూరల్, ఫిబ్రవరి 6: మండలంలో దొంగలు పేట్రేగిపోతున్నారు. ఇళ్లనూ, రైతుల పొలాల్లో ఉన్న వ్యవసాయ పరికరాలను టార్గెట్ చేస్తున్నారు. డ్రిప్పు పరికరాలు, ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం చేసి ఆయిల్, కాపర్ చోరీలకు పాల్పడి రైతులను ఆందోళనకు గురిచేస్తున్నారు. ప్రజలకు రక్షణగా ఉండాల్సిన పోలీసులు దొంగలను పట్టుకోవడంలో విఫలమయ్యారన్న విమర్శలు ధర్మవరం రూరల్ పరిధి పోలీస్



చీరలను చెదురుగా పడేసిన దొంగలు (ఫైల్)

స్టేషన్‌పై వ్యక్తమవుతున్నాయి. ధర్మవరం రూరల్ పరిధిలోని రైతులు ఎక్కువశాతం వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. అయితే ఈ మధ్యకాలంలో వారి పొలాల్లోకి దొంగలు ప్రవేశించి డ్రిప్పు, వ్యవసాయ పనిముట్లు, పైపులు చోరీ చేస్తున్నారు. అదేవిధంగా ఇళ్లల్లో సైతం దొంగతనాలు తరచూ జరుగుతున్నాయి. వీటిపై పోలీసులకు ఫిర్యాదుచేసినా వాటి గురించి పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

డ్రిప్పు పరికరాల చోరీ.. ఆటోను పట్టించిన రైతులు

గత ఏడాది డిసెంబరు 30న తెల్లవారజామున ధర్మవరం మండలం సరిహద్దులోని మామిళ్లపల్లిలో రైతు రామక్రిష్ణారెడ్డి పొలంలో ఉన్న డ్రిప్పు పరికరాలను దొంగలు ఆటోలో వేసుకుని ముచ్చురామి మీదుగా వెళ్తున్నారు. ఈ క్రమంలో ఆగ్రామ రైతులు తెల్లవారుజామున ఆటోలో పరికరాలు తీసుకుపోతుండటంతో అనుమానం వచ్చి ఆటోను వెంబడించి పట్టుకున్నారు. ఆటోలోని వ్యక్తులు పొంతనలేని సమాధానాలు చెప్పడంతో ధర్మవరంరూరల్ పోలీసులకు అప్పగించారు. నలుగురిని తాము పోలీసులకు అప్పజెప్పామని రైతులు అంటుండగా పోలీసులు ఒకరిపై మాత్రమే కేసు నమోదు చేశారు. మిగతా ముగ్గురిని రాజకీయ ఒత్తిళ్ల నేపథ్యంలో వదిలేసినట్లు ఆ శాఖ వర్గాల ద్వారా తెలుస్తోంది.

కేసు ఛేదింపు ఏదీ...?

గత ఏడాది డిసెంబరు 24న బడన్నపల్లి గ్రామానికి చెందిన రైతులు బయప్ప, కాటమయ్య, గోపాల్, శివయ్యలకు చెందిన పొలాల్లో ఉన్న రెండు ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేసి అందులో విలువైన కాపర్, ఆయిల్‌ను చోరీచేశారు. ఈ సంఘటనపై రైతులతోపాటు ట్రాన్స్‌కో అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రెండు ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసంచేయడంతో విద్యుత్‌సరఫరా లేక రైతులు సాగుచేసిన పంట పొలాలు ఎండుదశకు చేరుకున్నాయని ఆ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అయితే వీటిపై పోలీసులు ఫిర్యాదు తీసుకున్నా చోరీకి పాల్పడినవారిని పట్టుకునేందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

● నేలకోట, ఏలుకుంట్ల, బుడ్డారెడ్డిపల్లి, బిల్వంపల్లి గ్రామాల్లో తరచూ రైతుల పొలాల్లో స్ప్రింక్లర్లు, స్టార్టర్‌పెట్టెలు, పైపులు చోరీలు జరుగుతున్నాయని ఆ గ్రామరైతులు ఆవేదనవ్యక్తం చేశారు. పంటలు చేతికొచ్చేస



బడన్నపల్లి వద్ద ఆయిల్, కాపర్ కోసం దొంగలు ధ్వంసం చేసిన ట్రాన్స్‌ఫార్మర్ (ఫైల్)

మయంలో ఇలా వ్యవసాయ పరికరాలు చోరీకి గురికావడంతో అదనపు భారం పడుతోందని రైతులు వాపోతున్నారు. ఈ చోరీలపై పలుమార్లు గ్రామరైతులు పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు.

పోతుకుంటలో ఆరు ఇళ్లలో దొంగల బీభత్సం

గత ఏడాది డిసెంబరులో 12న అర్ధరాత్రి మండలంలోని పోతుకుంట బృందవన్‌కాలనీకి చెందిన వడ్డె కొండా, సుజాతమ్మ, శివ, లక్ష్మీదేవి, నాగభూషణం ఇళ్లను తాళాలు పగలగొట్టి దొంగలు బీభత్సం సృష్టించారు. వడ్డేకొండా ఇంట్లో బీరువాను పగలగొట్టి రూ.లక్షదాకా నగదు, 9తులాలు బంగారు చోరీ చేశారు. సుజాతమ్మ ఇంట్లో రెండున్నర తులాల బంగారు, కాలివెండిగొలుసులు, 1000నగదు చోరీ జరిగింది. శివ, లక్ష్మీదేవి, నాగభూషణం ఇంట్లో మగ్గాలు ఉండటంతో మగ్గం సామాన్లను ధ్వంసం చేశారు. సుజాతమ్మ ఇంటికి తాళం వేసి గొర్రెల మంద వద్దకు వెళ్లగా ఇంటితాళం పగలగొట్టి బీరువాలోని బంగారునగలు, నగదును ఎత్తికెళ్లారు. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఇళ్లను పరిశీలించారేకాని ఇంతవరకు దొంగలను పట్టుకోలేదు.

చోరీలను అరికడతాం

ధర్మవరం డివిజన్ పరిధిలోని రెండుకేసుల్లో రికవరీచేసి బాధితులకు న్యాయం చేశాం. ఎక్కడైనా చోరీలు జరిగితే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే వెంటనే వాటిపై విచారణ చేసి చర్యలు చేపట్టి చోరీలను అరికడతాం.

- శ్రీనివాసులు, డీఎస్పీ, ధర్మవరం

టీడీపీతోనే అభివృద్ధి

రాష్ట్ర కార్యదర్శి కమతం కాటమయ్య



కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

ధర్మవరం, ఫిబ్రవరి 6: టీడీపీతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని రాష్ట్ర కార్యదర్శి కమతం కాటమయ్య, పట్టణ అధ్యక్షుడు పరిశే సుధాకర్ అన్నారు. మంగళవారం 39వ వార్డులోని రాంనగర్‌లో 'బాబుష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ' నిర్వహించారు. ఈ సందర్భంగా మినీమేనిఫెస్టోలోని అంశాలతో కూడిన కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన కలయికలో ప్రభుత్వ ఏర్పాటు ఖాయమన్నారు. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లల్లో చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. సీసీరోడ్లు వేయక, డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. చేనేత వ్యవస్థ నిర్వీర్యమైందన్నారు. ప్రభుత్వం అందించే నేతన్న నేస్తం పథకం వైసీపీ వారికే తప్పా అర్హులకు అందడంలేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు భీమనేని ప్రసాద్‌నాయుడు, రాళ్లపల్లి షరీఫ్, అశోక్, మాధవరెడ్డి, గోసల శ్రీరాములు, కరెంటు ఆది, జిలకరశీన, మారుతీస్వామి పాల్గొన్నారు.

బీసీలకు రక్షణ తెలుగుదేశంతోనే..

జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ



కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

పుట్టపర్తిరూరల్, ఫిబ్రవరి 6: తెలుగుదేశంపార్టీతోనే బీసీలకు రక్షణ అని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ అన్నారు. మంగళవారం పట్టణంలోని మూడవవార్డులో 'బాబుష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ' నిర్వహించారు. ఈ సందర్భంగా మినీమేనిఫెస్టోలోని అంశాలతో కూడిన కరపత్రాల్ని పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి బీసీల అభివృద్ధికి నిరంతరం పాటుపడుతోందన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలిపించాలని కోరారు. పార్టీ అధికారంలోకి రాగానే అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందిస్తామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాగరాజు, నారాయణస్వామి, రమణ, గంగాద్రి, చెన్నప్ప, వెంకటరాముడు పాల్గొన్నారు.

రేపు జయహో బీసీ సదస్సు



సమావేశమైన టీడీపీ నాయకులు

నంబులపూలకుంట, ఫిబ్రవరి 6: మండలకేంద్రంలోని శివాలయం వద్ద మల్లికార్జునస్వామి కమ్యూనిటీ హాల్‌లో గురువారం టీడీపీ జయహో బీసీ సదస్సు నిర్వహిస్తున్నట్లు మండల కన్వీనర్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం శివాలయం వద్ద తెలుగు తమ్ముళ్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సదస్సుకు నియోజకవర్గ ఇన్‌చార్జి కందికుంట వెంకటప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. మండలంలోని బీసీలు హాజరై సదస్సును విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో క్లస్టర్ ఇన్‌చార్జి దండేరవి పాలగిరి బాషా, గంగశేఖర్, హరిప్రసాద్, వంకమద్ది రవి, మల్లికార్జునాయుడు, శేఖర్‌నాయుడు, ఆనప్పనాయుడు, శ్రీరాములనాయుడు, ఆదినారాయణ, రామిరెడ్డి, నాయకులు, కార్యకర్తలున్నారు.

జయప్రదం చేయండి

కదిరి అర్బన్: నియోజకవర్గ ఇన్‌చార్జి కందికుంట వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో కోనేరు వద్ద ఉన్న వేంకటేశ్వర కల్యాణమండపంలో బుధవారం జయహో బీసీ సభను జయప్రదం చేయాలని మండల నాయకుడు హరి మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. టీడీజీ, జనసేన నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని తెలిపారు.

అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు

తహసీల్దార్ నరేంద్రకుమార్ హెచ్చరిక



సిబ్బందితో మాట్లాడుతున్న తహసీల్దార్

నంబులపూలకుంట, ఫిబ్రవరి 6: ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని తహసీల్దార్ నరేంద్రకుమార్ హెచ్చరించారు. మండలంలోని కదిరి, రాయచోటి ప్రధాన రహదారి వంకమద్ది రోడ్డుకు సమీపంలోని ప్రభుత్వ స్థలంలో రాజేంద్ర అనే వ్యక్తి అక్రమంగా రేకులషెడ్ నిర్మాణం చేపట్టారు. మంగళవారం ఆ ప్రాంతానికి తహసీల్దార్‌తోపాటు డిప్యూటీ తహసీల్దార్ రవినాయక్, వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలు, పోలీస్ సిబ్బంది వెళ్లారు. జేసీబీతో రేకుల షెడ్‌ను తొలగించడానికి ప్రయత్నించగా రాజేంద్ర ఐదురోజులు గడువు కోరాడు. రెండురోజుల్లో ఖాళీ చేయాలని హెచ్చరించారు. ప్రభుత్వ స్థలాల్లో అధికారుల అనుమతి లేకుండా ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదన్నారు. కార్యక్రమంలో వీఆర్‌ఓలు క్రిష్టప్ప, దీపిక, రఘు, ఆర్ఐ శ్రీధర్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

ఆటో, ద్విచక్రవాహనం ఢీ

యువకుడికి తీవ్రగాయాలు

ముదిగుబ్బ, ఫిబ్రవరి 6: మండల పరిధిలోని కొడవండ్లపల్లి గ్రామ సమీపంలో ఆటో, ద్విచక్ర వాహనం ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. పీసీరేవు గ్రామానికి చెందిన మధుసూధన్ ద్విచక్రవాహనంలో బూదనాంపల్లి వైపు వెళుతుండగా పీసీరేవు వైపు వస్తున్న ఆటో కొడవండ్లపల్లి ఢీ కొంది. దీంతో మధుసూదన్‌కు తీవ్ర గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. అతడిని బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించినట్లు తెలిపారు.

స్త్రీనిధి రుణాలు రికవరీ అయ్యేనా..?

అయోమయంలో పొదుపు సంఘాల మహిళలు

గాండ్లపెంట, ఫిబ్రవరి 6: పొదుపు సంఘాల్లో తీసుకున్న రుణాలను యానిమేటర్లు, సిబ్బంది చేతివాటంతో చెల్లించాల్సిన మొత్తం చెల్లించకపోవడంతో రుణాలు నిలిపివేశారు. తీసుకున్న రుణాలను పొదుపు సంఘాల మహిళలు ప్రతినెలా కంతుల రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. అయితే కొంతమంది యానిమేటర్లు, సిబ్బంది చేతివాటం ప్రదర్శించడంతో రుణాలు నిలిపివేశారు. గత రెండు సంవత్సరాల క్రితం స్త్రీ నిధిలో కటారుపల్లి, గొల్లపల్లికి చెందిన 14 పొదుపు సంఘాలకు రూ.12లక్షలకు పైగా యానిమేటర్ డబ్బులు తీసుకుని ఆయన సొంత అవసరాలకు ఉపయోగించుకున్నది పాఠకులకు విదితమే. దీంతో రుణాలు మంజూరు చేయలేదు. స్త్రీనిధి రుణాలు కట్టని పొదుపు సంఘాల సభ్యులకు వెంటనే డబ్బులు చెల్లించాలని నోటీసులు జారీ అయ్యాయి. వారు గొల్లపల్లికి చెందిన యానిమేటర్ రామాంజులుపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తాను డబ్బు చెల్లిస్తానని మహిళా సంఘాల సభ్యులకు హామీ ఇచ్చాడు. అయితే వారం రోజులక్రితం అతను గ్రామం వదిలి వెళ్లిపోయాడు. దీంతో ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో మహిళా సంఘాల సభ్యులు ఉన్నారు. స్త్రీ నిధి రుణాలు వెంటనే చెల్లించాలని వారిపై ఒత్తిడి ఎక్కువైంది. 12 సంఘాలకు గాను వందమందికి పైగా సభ్యులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. పోలీస్‌స్టేషన్‌లో యానిమేటర్ రామాంజులు, ఏపీఎం సూర్యనారాయణ, సీసీలు చౌడప్ప, ప్రసాద్‌లపై ఫిర్యాదు



పోలీసులకు ఫిర్యాదు చేసిన పొదుపు సంఘాల మహిళలు (ఫైల్)

చేశారు. తాము డబ్బు యానిమేటర్‌కు చెల్లించామని, అయితే సక్రమంగా జమ అవుతున్నాయా..? లేదా..? అన్నది సీసీలు, ఏపీఎంలు పరిశీలించాల్సి ఉంటుందని మహిళాసంఘాల సభ్యులు అంటున్నారు. వారు రికార్డులను సరి చూసుకోకుండా డబ్బులు చెల్లించాలని తమపై ఒత్తిడి చేయడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. డబ్బును కాజేసిన వారిపై విచారణ చేసి తమకు న్యాయం చేయాలని మహిళా సంఘాల సభ్యులు గంగాదేవి, మున్నీ, రెహానా, శివమ్మ, రమణమ్మ తదితరులు కోరుతున్నారు.

డబ్బులు చెల్లించాలని నోటీసులు



మద్దిలేటి పొదుపు సంఘంలో ఉన్నాను. రెండు సంవత్సరాల క్రితం స్త్రీ నిధిలో రుణం తీసుకున్నాను. యానిమేటర్‌కు డబ్బులు చెల్లించాం. ప్రతినెలా కంతు డబ్బులు అందచేశాం. యానిమేటర్ డబ్బులు కట్టకపోవడంతో తాను చెల్లించాలని నోటీసులు జారీ చేశారు.

- గంగులమ్మ, కటారుపల్లి గొల్లపల్లి

ఒత్తిడి అధికమైంది..



త్రివేణి సంఘంలో ఉన్నాను. కూలీపనులకెళ్లి ప్రతినెలా కంతు చెల్లించా. డబ్బులు యానిమేటర్ స్వాహా చేశాడని తెలిసింది. డబ్బు మీరే చెల్లించాలని ఐకేపీ సిబ్బంది ఒత్తిడి చేస్తున్నారు. ఎక్కడినుంచి తెచ్చి కట్టాలో అర్థం కావడంలేదు. దీనిపై పోలీసులు విచారణ చేసి న్యాయం చేయాలి.

- భవాని, కటారుపల్లి గొల్లపల్లి

స్ట్రాంగ్ రూంల పరిశీలన

కదిరి, ఫిబ్రవరి 6: పట్టణంలోని బాలుర జూనియర్ కళాశాలలో స్ట్రాంగ్ రూంలను కలెక్టర్ అరుణ్‌బాబు మంగళవారం పరిశీలించారు. కళాశాలలోని గదులను, సౌకర్యాలను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయనతోపాటు ఆర్డీఓ వంశీకృష్ణ, డీఎస్పీ శ్రీలత, ఇన్‌చార్జి తహసీల్దార్ సునీత, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ ముకుందా, మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్, ఎస్ఐ బాబ్‌జాన్, ఆర్ఐ ముస్వీర్ తదితరులున్నారు.

పుట్టపర్తి: రానున్న సార్వత్రిక ఎన్నికలకు అవసరమైన ఏర్పాట్లను ముందస్తుగా సిద్ధం చేయాలని కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయంలో వ్యవసాయ గోదాము భవనాన్ని కలెక్టర్ పరిశీలించారు. పుట్టపర్తి నియోజకవర్గానికి సంబంధించి ఈవీఎంలు భద్రపరచడానికి స్ట్రాంగ్ రూమ్ కోసం గోడౌన్‌ను ఉపయోగించుకోవాలని, ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు చేయాలన్నారు. గోడౌన్‌లో ఉన్న



మైదానాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

సరుకును తరలించాలన్నారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ భాగ్యరేఖ, డీఐఓ లక్ష్మణ్ణ తదితరులు ఉన్నారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

సీఐటీయూ జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ

పుట్టపర్తి, ఫిబ్రవరి 6: సమానపనికి సమానవేతనం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో మునిసిపల్ కార్మికులు ర్యాలీగా వెళ్లి కలెక్టరేట్ ముందు నిరసన చేపట్టారు. కలెక్టరేట్ వద్ద బైఠాయించి సమస్యలపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమ్మె సందర్భంగా 30రోజుల్లో మునిసిపల్ కార్మికుల హామీలు పరిష్కరిస్తామన్న ప్రభుత్వం ఇంతవరకూ స్పందించలేదన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే పెద్దఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. అనంతరం డీఆర్ఓ కొండయ్యకు వినతిపత్రం అందజేశారు. నిరసనలో సీఐటీయూ నాయకులు వెంకటేశు, కార్మిక సంఘం నాయకులు రామయ్య, గోవిందు, నాగార్జున, రామాంజినేయులు, వెంకటేశులు, నాగరాజు పాల్గొన్నారు.

'పోలీసులు అరెస్టు చేయడం దారుణం'

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 6: సమస్యలపై అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న సర్పంచ్‌ల సంఘం ప్రతినిధులను మంగళవారం మంగళగిరి పోలీసులు అరెస్టు చేసినట్లు ఆ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు వడ్డిపల్లి శంకర్‌రెడ్డి తెలిపారు. అసెంబ్లీ ముట్టడికోసం బస్సులో వెళ్తుండగా, మంగళగిరి పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించి సాయంత్రం సొంత పూచీకత్తుపై విడుదల చేయడం జరిగిందన్నారు. పంచాయతీరాజ్‌చాంబర్ జాతీయ అధ్యక్షుడు బాబురాజేంద్రప్రసాద్ ఆదేశాల మేరకు అసెంబ్లీ ముట్టడి తలపెట్టామన్నారు. సర్పంచ్‌లకు రావాల్సిన నిధులను అడిగేందుకు వెళ్తుంటే అడ్డుకుని అరెస్టు చేయడం సరికాదన్నారు.

ఎస్పీని కలసిన ఆర్ఐ



పుట్టపర్తిరూరల్, ఫిబ్రవరి 6: అన్నమయ్య జిల్లాలో ఆర్ఐ పనిచేస్తున్న ఎస్ఎం వలి జిల్లాకు బదిలీపై వచ్చారు. మంగళవారం ఆయన ఎస్పీ మాధవరెడ్డిని మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందచేశారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

బత్తలపల్లి, ఫిబ్రవరి 6: మండలకేంద్రమైన బత్తలపల్లిలోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ శివశంకర్‌నాయక్ మంగళవారం పరిశీలించారు. మౌలిక వసతులపై ఆరాతీశారు.

అర్హులకు ఓటుహక్కు కల్పిస్తాం: ఆర్డీఓ

ధర్మవరం రూరల్, ఫిబ్రవరి 6: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఓటుహక్కు కల్పిస్తామని ఆర్డీఓ వెంకటశివరామిరెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం ఆర్డీఓ కార్యాలయంలో వివిధ రాజకీయపార్టీల ప్రతినిధులతో ఓటర్ల జాబితాపై ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న రాజకీయపార్టీల ప్రతినిధులు మాట్లాడుతూ ఇప్పటివరకు ఓటరు జాబితా అవకతవకలపై ఆధారాలతో కూడిన నివేదికలు అందించామని అయినా తుదిజాబితాలో తప్పులు దొర్లాయన్నారు. ఆర్డీఓ మాట్లాడుతూ ఓటరుజాబితాలపై ఎటువంటి ఫిర్యాదులు వచ్చినా వెంటనే పరిష్కారిస్తామన్నారు. మృతులు, డబుల్, తొలగింపుల ఓట్లపై బీఎల్‌ఓలతో పారదర్శకంగా విచారణ చేసి ఓటరుజాబితాను తయారుచేస్తామన్నారు. ఇప్పటివరకు వచ్చిన క్లైంలను, కొత్తవాటిని విచారణ చేసి అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ఓటుహక్కు కల్పిస్తామన్నారు. సమావేశంలో తహసీల్దార్ రమేష్, ఎన్నికల్ సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీదేవి, సిబ్బంది రాజ్‌కుమార్, టీడీపీ, వైసీపీ, బీజేపీ, కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోండి

పుట్టపర్తి రూరల్: ఓటరుగా నమోదు చేసుకోవడానికి అవకాశం ఉందని ఆర్డీఓ భాగ్యరేఖ సూచించారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మంగళవారం గుర్తింపు పొందిన రాజకీయపార్టీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ 18ఏళ్లు నిండిన వారు ఇంకా ఆన్‌లైన్‌లో ఓటరుగా నమోదు చేసుకోవడానికి అవకాశం ఉందన్నారు. ఓటర్లు తమ ఓటు వివరాలను సరిచూసుకోవచ్చన్నారు. మరణించిన, డబుల్ ఎంట్రీలు, గ్రామంలో లేని ఓటర్లు ఎవరైనా ఉంటే గుర్తించాలన్నారు. తహసీల్దార్లు పోలింగ్ కేంద్రాలను పరిశీలించాలని, మౌలిక సదుపాయాలపై ఆరా తీయాలన్నారు. కార్యక్రమంలో పుట్టపర్తి, నల్లమాడ, కొత్తచెరువు, బుక్కపట్నం తహసీల్దార్లు వేణుగోపాల్, నాగభూషణం, కళావతి, రామకృష్ణ, పుట్టపర్తి మునిసిపల్ కమిషనర్ అంజయ్య, ఈడీటీలు నరసింహులు, మనోజ్‌కుమార్, రెహమాన్, తరుణ్‌తేజ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

ధర్మవరం, ఫిబ్రవరి 6: పట్టణంలోని బసవన్నకట్ట వీధికి చెందిన రామక్రిష్ణారెడ్డి(38) ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. రామక్రిష్ణారెడ్డి రైల్వేస్టేషన్‌లో వడలు, చిరుతిండ్లు అమ్ముతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అయితే మంగళవారం రాత్రి ఇంటిలో ఓ గదిలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు అతడిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

ఏపీ బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నాగరాజు

కదిరి, ఫిబ్రవరి 6: ఆంధ్రప్రదేశ్ బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా తనను నియమించినట్లు చింతా నాగరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళగిరిలోని రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు శంకర్‌రావు నియామక పత్రం అందించినట్లు పేర్కొన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని నాగరాజు ఆ ప్రకటనలో తెలిపారు.

'టీకాలతో సంపూర్ణ ఆరోగ్యం'

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 6: సకాలంలో పశువులకు టీకాలు వేయిస్తే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటాయని పశుసంవర్ధకశాఖ ఉపసంచాలకులు డాక్టర్ సత్యప్రకాష్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని ఎం. కొత్తపల్లి గ్రామంలో రైతులకు పశువిజ్ఞానబడి కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ప్రధానంగా రైతులు పాడి పశువులకు బీమా చేయించడం ద్వారా కలిగే లాభాలను వివరించారు. సకాలంలో గాలికుంట, ఇతర టీకాలు వేయించగలిగితే పశువులు రోగాల బారిన పడకుండా ఉంటాయన్నారు. హెల్త్‌కార్డుల ప్రాముఖ్యతను, పాల నాణ్యత ఎలా అభివృద్ధి చేసుకోవాలో వివరించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి ప్రవీణ్‌కుమార్, పశుసంవర్ధ సహాయకులు జ్యోష్నప్రియ పాల్గొన్నారు.

'అతివేగమే ప్రమాదాలకు కారణం'

తనకల్లు, ఫిబ్రవరి 6: అతివేగమే ప్రమాదాలకు కారణమని ఎంవీఐ వరప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని అంబేద్కర్ సర్కిల్‌లో రోడ్డు భద్రత మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణ సమయంలో ప్రతిఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దేశంలో ప్రతినిమిషానికి ఒక రోడ్డు ప్రమాదం జరుగుతుండగా, ఒకరు మృత్యువాత పడుతున్నారన్నారు. ఎక్కువశాతం అతివేగంతోనే ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. వాహనాలు నడిపేవారు రోడ్డు నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలన్నారు.

వాహనాల తనిఖీ

మండలపరిధిలోని కొక్కంటి క్రాస్‌లో మంగళవారం కదిరి ఎంవీఐ వరప్రసాద్ వాహనాలను తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. రికార్డులు లేని వాహనాలపై కేసులు నమోదు చేశారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు.

నల్లమాడ: మండలకేంద్రానికి సమీపంలో ఎస్ఐ రమేష్‌బాబు మంగళవారం వాహనాలు తనిఖీ చేశారు. వాహనాల రికార్డులు, లైసెన్సులు పరిశీలించారు. అదేవిధంగా వాహనదారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

కొనసాగిన భవన కార్మికుల దీక్ష

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 6: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండలకేంద్రంలో భవన కార్మికులు తలపెట్టిన దీక్ష మంగళవారం 8వరోజు కొనసాగింది. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు శ్రీరాములు, కుళ్లాయప్ప మాట్లాడుతూ 8 రోజులుగా దీక్ష చేస్తున్నా ప్రభుత్వం, అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. అధికారులు స్పందించి భవన కార్మికులకు ఇంటిపట్టాలు ఇవ్వాలని, లేనిపక్షంలో ఆమరణ నిరాహార దీక్ష చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

పుట్టపర్తి రూరల్, ఫిబ్రవరి 6: పెడపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో బుధవారం విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ శీనానాయక్ తెలిపారు. ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు సబ్‌స్టేషన్ మరమ్మతుల దృష్ట్యా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆయన వివరించారు.

'డ్రైవర్ వృత్తి బాధ్యతాయుతమైనది'

కదిరి: డ్రైవర్ వృత్తి బాధ్యతాయుతమైందని, నిర్లక్ష్యం వహిస్తే ప్రాణాలు పోతాయని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎంఎస్ వరప్రసాద్ అన్నారు. మంగళవారం డ్రైవర్స్ డేని పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో డ్రైవర్స్ అసోసియేషన్ నాయకులు పులిచంద్ర, అబ్దుల్ రజాక్, రహిమాన్, మహబూబ్‌బాషా, రహంతుల్లా, రమణ పాల్గొన్నారు.

అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

ధర్మవరం, ఫిబ్రవరి 6: అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని మునిసిపల్ కార్మికసంఘం నాయకులు బాబు, ప్రసాద్ పేర్కొన్నారు. సమ్మె సందర్భంగా మంత్రివర్గం ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చలేదని కలెక్టరేట్ ఎదుట ధర్నాకు మంగళవారం పిలుపునిచ్చింది. ప్రభుత్వం పోలీసుల ద్వారా మున్సిపల్ కార్మికులను అరెస్టు చేసి టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వారు మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం కూడా ఇటువంటి చర్యలకు పాల్పడలేదన్నారు. ప్రభుత్వం పోలీసుల ద్వారా ఉద్యమాలను అణచివేయాలని చూడటం దారుణమన్నారు.

కొల్హాపురమ్మకు ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న కొల్హాపురి మహాలక్ష్మి

అగళి, ఫిబ్రవరి 6: మండలంలోని కోడిపల్లిలో వెలసిన రత్నగిరి కొల్హాపురి మహాలక్ష్మీ దేవి అమ్మవారి ఉత్సవాలు మంగళవారం అంగరంగ వైభవంగా జరిగాయి. గ్రామస్థులు అమ్మవారికి పట్టం కట్టారు. ఉదయం నుంచి అమ్మవారి మూలవిరాట్టుకు అభిషేకాలు చేసి ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం కుంకుమార్చనలు తదితర విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా మహిళలు భక్తిశ్రద్ధలతో ఊరేగింపుగా జ్యోతులు మోసుకొని ఆలయం వద్దకు చేరుకున్నారు. అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ ఉత్సవాలకు పలు రాజకీయ పార్టీల నాయకులతో పాటు ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి వందలాది మంది భక్తులు తరలివచ్చి అమ్మవారికి పూజలు చేశారు. గ్రామస్థుల ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాద వినియోగంతోపాటు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

నేడు జయహో బీసీ సదస్సు

గోరంట్ల, ఫిబ్రవరి 6: మండలంలోని గుమ్మయ్యగారిపల్లి కూడలిలో బుధవారం టీడీపీ ఆధ్వర్యంలో జయహో బీసీ సదస్సును నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల కన్వీనర్ సోమశేఖర్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీడీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బీకే పార్థసారథి, ఉమ్మడి జిల్లా బీసీ నాయకులు హాజరవుతారని తెలిపారు. గోరంట్లలోని ఎంఎంఎస్ ఫంక్షన్‌హాల్‌లో ఉదయం 10.30గంటలకు జరిగే సమావేశానికి టీడీపీ, జనసేన, తెలుగుయువత, తెలుగు మహిళ, బీసీ, ఎస్సీఎస్టీ, మైనార్టీ సెల్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

'టీడీపీ గెలుపే ధ్యేయంగా పనిచేయాలి'

అగళి, ఫిబ్రవరి 6 : టీడీపీ గెలుపే ధ్యేయంగా పనిచేయాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు మాజీ ఎమ్మెల్యే మద్దనకుంట ఈరన్న కుమారుడు డాక్టర్ సునీల్ సూచించారు. ఆయన అగళి మండలంలో రెండు రోజులుగా విస్తృతంగా పర్యటించారు. టీడీపీ గెలుపే ధ్యేయంగా పనిచేయాలని కార్యకర్తలు, నాయకులకు సూచించారు. ప్రతి గ్రామానికి వెళ్లి పార్టీ నాయకులు, కార్యకర్తలతో చర్చించారు. టీడీపీ బలోపేతానికి కృషిచేయాలన్నారు. 2024ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రావాలని అందులో భాగంగా మడకశిర నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థిని గెలిపించుకోవాలని తెలిపారు. పార్టీలో భేదాభిప్రాయాలు విడనాడి పార్టీ అభివృద్ధికి కృషిచేయాలని వారితో తెలిపారు. ఆయన వెంట పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

11న ఉచిత గుండె వైద్య శిబిరం

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 6: యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం హిందూపురం జోన్ ఆధ్వర్యంలో ఈ నెల 11న ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు యూటీఎఫ్ నాయకులు తెలిపారు. ఆత్మీయ ట్రస్ట్ ధర్మవరం వారి సహకారంతో ఈ శిబిరం అందిస్తున్నట్లు వారు తెలిపారు. 11న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు స్థానిక అల్‌హిలాల్ పాఠశాలలో శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం నూతన మునిసిపల్ కమిషనర్ శ్రీకాంత్ చేతుల మీదుగా సంబంధిత కరపత్రాలు విడుదల చేశారు.

ద్విచక్రవాహనం బోల్తా
ఇద్దరు విద్యార్థులకు గాయాలు

గోరంట్ల, ఫిబ్రవరి 6: మండలంలోని కదిరి ప్రధాన రహదారిలో చలమయ్యగారిపల్లి వద్ద ద్విచక్రవాహనం అదుపు తప్పి బోల్తాపడిన సంఘటనలో యూనివర్సిటీ విద్యార్థులు మహర్షి, ప్రఖ్యాత్ మంగళవారం తీవ్రంగా గాయపడ్డారు. తిరుపతి పట్టణానికి చెందిన వీరిద్దరు గోరంట్ల మండలంలోని కమ్మలవాండ్లపల్లి వద్ద గల బోస్టు ఇన్నోవేషన్ యూనివర్సిటీలో అగ్రికల్చర్ బీఎస్సీ చివరి సంవత్సరం చదువుతున్నారు. వారు సొంత ఊరైన తిరుపతికెళ్లి మంగళవారం ద్విచక్రవాహనంపై గోరంట్లకు వస్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో మహర్షి కుడికాలుకు గాయం కాగా, ప్రఖ్యాత్‌కు అక్కడక్కడ గాయాలయ్యాయి. వారిని గోరంట్ల ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా, డాక్టర్ హరీష్ చికిత్సలు చేశారు. అనంతరం మహర్షిని మెరుగైన వైద్యం కోసం హిందూపురం వెళ్లాలని సూచించారు.

యువతిపై దాడికి యత్నం

హిందూపురం, ఫిబ్రవరి 6: పట్టణంలోని ముక్కిడిపేటలోని ముళ్లమోతుకపల్లిలో ఓ యువతిపై స్థానికులు దాడికి యత్నించారు. లేపాక్షికి చెందిన ఓ యువతి కుటుంబం ఆర్థిక పరిస్థితి బాగాలేకపోవడంతో యాచించడానికి ముళ్లమోతుకపల్లికి వెళ్లింది. ఆ యువతికి యాచించడం కొత్త కావడంతో చిన్న పిల్లలకు దూరంగా చాలాసేపు నిలుచుంది. దీంతో అనుమానం వచ్చిన స్థానికులు చిన్నారులను ఎత్తుకెళ్లేందుకు వచ్చిందని వదంతులు పుట్టించడంతో అక్కడకు కొంతమంది వచ్చి ఆమెపై దాడికి యత్నించారు. ఆ యువతి తన వివరాలు చెప్పడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు అక్కడికి వెళ్లి యువతిని వన్‌టౌన్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. యువతి వివరాలు ఆరాతీసి ఆమె తల్లిని పిలిపించారు. లేపాక్షికి చెందిన పలువురితో ఆరాతీసి పంపించేసినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

పాఠశాల అభివృద్ధికి
కెనరా బ్యాంక్ అధికారుల కృషి: పీడీ

గుడిబండ, ఫిబ్రవరి 6: మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి కెనరాబ్యాంక్ అధికారి లోక్‌నాథ్‌రెడ్డి కృషిచేయనున్నట్లు డీఆర్‌డీఏ పీడీ నరసయ్య తెలిపారు. ఆయన మంగళవారం పాఠశాలలో విద్యార్థులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఏ పీడీ నరసయ్య మాట్లాడుతూ విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమన్నారు. అనంతరం గుడిబండ కెనరాబ్యాంక్ మేనేజర్ లోక్‌నాథ్‌రెడ్డి పాఠశాలకు ఫర్నిచర్ అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోవిందప్ప, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నేడు పురానికి ఎమ్మెల్యే బాలకృష్ణ రాక



హిందూపురం, ఫిబ్రవరి 6: ప్రముఖ సినీనటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ బుధవారం నియోజకవర్గానికి రానున్నట్లు టీడీపీ నాయకులు తెలిపారు. ఆయన బుధవారం సాయంత్రం బెంగళూరు నుంచి రోడ్డు మార్గాన కొడికొండ చెక్‌పోస్టుకు విచ్చేసి అక్కడ సొంత నిధులతో ఏర్పాటుచేసిన వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తారు. అదేవిధంగా లేపాక్షి మండలం శిరివరంలో కూడా వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తారని తెలిపారు. గురువారం జేవీఎస్ ఫంక్షన్ హాలులో పట్టణంలోని ఎనిమిది వార్డులకు సంబంధించిన టీడీపీ నాయకులు, కార్యకర్తలతో వేరువేరుగా సమీక్ష జరపనున్నట్లు టీడీపీ నాయకులు తెలిపారు.

ఓటరు జాబితాలో తప్పులుంటే సరిదిద్దుకోండి

రాజకీయ పార్టీల నాయకుల సమావేశంలో జేసీ



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్

హిందూపురం, ఫిబ్రవరి 6 : ఓటరుజాబితాలో ఎక్కడైనా తప్పులుంటే సరిదిద్దుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ రాజకీయ పార్టీల నాయకులకు సూచించారు. ఆయన మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.... నియోజకవర్గంలో ప్రస్తుతం ఉన్న ఓటర్ల వివరాలు తెలిపారు. అయితే ఎక్కడైనా ఒకటి రెండు తప్పులుంటే వాటిని సరిదిద్దుకునేందుకు అవకాశం ఉందన్నారు. ఏవైనా అభ్యంతరాలుంటే రెవెన్యూ, మునిసిపల్ అధికారుల దృష్టికి తీసుకురావాలని నాయకులకు సూచించారు. అనంతరం ఆర్టీసీ కాలనీలోని పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేసే పాఠశాలలను పరిశీలించారు. పాఠశాలల్లో తాగునీరు, ఫర్నిచర్, వెలుతురు, మరుగుదొడ్లు తదితర వసతులపై అధికారుతో ఆరాతీశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శివప్రసాద్‌రెడ్డి, మునిసిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రెడ్డి, ఎన్నికల డీటీ రెడ్డిశేఖర్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరెడ్డి, ఎన్నికల సిబ్బంది వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

అయ్యో.... పాపం..! అనే వారు లేరు

ఇది హిందూపురం ప్రభుత్వాసుపత్రిలో పరిస్థితి

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 6: ప్రమాదంలో గాయపడినవారు, చేతకాని వారు, వృద్ధులు ఎవరైనా ప్రభుత్వాసుపత్రికి చికిత్సల కోసం వస్తే అక్కడ డ్యూటీ చేస్తున్న సెక్యూరిటీ గానీ, సిబ్బంది గానీ వారికి సహకరించాలి. నడవలేని వారిని వీల్‌చైర్ లేదా స్ట్రెక్చర్‌పై తీసుకెళ్లి సేవలు అందించాలి. అయితే హిందూపురం ప్రభుత్వాసుపత్రిలో అవేవీ పట్టడంలేదు. అటువంటి అసహాయులను పట్టించుకునే వారే లేరని, పైగా రోగులను కసురుకుంటారని ఆసుపత్రికి వచ్చిన వారు చర్చించుకుంటున్నారు. ప్రమాదంలో కాలికి గాయమైన ప్రకాష్ అనే అతడు కాలుకు కట్టు కట్టించుకోవాలని వచ్చాడు. అతడికి ఎవరూ తోడు లేకపోవడంతో ఒక్కడే వచ్చాడు. మొదట ఓపీ తీసుకొని వైద్యుడి వద్దకు దేకుకుంటూ వెళ్లాడు. అక్కడ వైద్య పరీక్షలు చేయించుకొని కాలుకు కట్టు కట్టించుకున్నాడు. మరలా మాత్రలు తీసుకోవడానికి దేకుకుంటూ అవస్థలు పడ్డాడు. అయితే ఆసుపత్రి సిబ్బంది ఎవరూ అతడిని పట్టించుకోలేదు. పాప మని తలచి సహకరించలేదు. పాపం అతడు దేకుతూనే అతి కష్టం మీద ఆసుపత్రి తనకు అవసరమైన చోటల్లా తిరిగాడు. ఇది చూసిన ప్రజలు అయ్యో పాపం అంటూ జాలిచూపారే తప్ప అతడికి సహాయం చేసిన వారు ఎవరూలేరు. ఇలాంటి పరిస్థితులు ఆసుపత్రిలో నిత్యం కనిపిస్తుంటాయి. ఇకనైనా ఆసుపత్రిలో అసహాయులకు సిబ్బంది సేవలందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



మాత్రల కోసం ఆసుపత్రిలో దేకుకుంటూ వెళ్తున్న బాధితుడు

టీడీపీ ప్రొఫెషనల్ వింగ్ నియోజకవర్గ అధ్యక్షుడిగా కార్తీక్



కార్తీక్‌కు నియామక పత్రాన్ని అందిస్తున్న బీకే పార్థసారథి

పెనుకొండ, ఫిబ్రవరి 6: తెలుగుదేశం ప్రొఫెషనల్ వింగ్ నియోజకవర్గ అధ్యక్షుడిగా పరిగి మండలానికి చెందిన కార్తీక్‌ను నియమించారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథి ఆయనకు నియామక పత్రాన్ని అందించారు. పార్టీని బలోపేతం చేసేందుకు కృషిచేయాలని ఈ సందర్భంగా బీకే సూచించారు.

క్రీడల్లో గెలుపోటములను సమానంగా తీసుకోవాలి
సీడబ్ల్యూసీ సభ్యుడు రఘువీరారెడ్డి

మడకశిర రూరల్, ఫిబ్రవరి 6: క్రీడాకారులు గెలుపోటములను సమానంగా తీసుకోవాలని సీడబ్ల్యూసీ సభ్యుడు రఘువీరారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని మణూరు ఉన్నత పాఠశాలకు చెందిన క్రీడాకారులు ఆడుదాం ఆంధ్ర క్రీడాపోటీల్లో భాగంగ మంగళవారం నియోజకవర్గ స్థాయిలో మడకశిరలో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో గెలుపొందారు. ఈ జట్టు మంగళవారం నీలకంఠాపురంలో రఘువీరారెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా రఘువీరారెడ్డి మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడాల్లో కూడా బాగా రాణించాలని వారికి సూచించారు. అదే విధంగా క్రీడాకారులు గెలుపు ఓటములను సమానంగా తీసుకోవాలన్నారు. గెలుపొందిన క్రీడాకారుల ను శాలువలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు తిమ్మారెడ్డి క్రీడాకారులు పాల్గొన్నారు.

వక్కచెట్ల నరికివేత

హిందూపురం, ఫిబ్రవరి 6 : పరిగి మండలం ముళ్లమోతుకపల్లిలోని తమ పొలంలో సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు వక్క చెట్లు నరికివేసినట్లు ఆ గ్రామానికి చెందిన బాధిత రైతులు అశ్వత్థరెడ్డి, శ్రీనివాసరెడ్డి చెందిన ఆవేదన వ్యక్తం చేశారు. ముళ్ల మోతుకపల్లి సమీపంలో తమకు ఉన్న 1.5ఎకరా వ్యవసాయతోటలో మూడేళ్ల కిందట వక్కచెట్లు పెట్టామని తెలిపారు. ఈ యేడాది పంట వచ్చే సమయం ఆసన్నమైందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పొలంలో 15 చెట్లను నరికేసినట్లు బాధిత రైతులు తెలిపారు. మంగళవారం ఉదయం వక్కతోట వద్దకు వెళ్లిన తాము ఇది గ్రమించామని తెలిపారు. అయితే తమకు ఎవరితోనూ ఎలాంటి కక్షలు లేవని, కానీ పచ్చని చెట్లను నరికేయడం బాధాకరమన్నారు. చెట్లను నరికి వేయడంతో పాటు చుట్టూ ఉన్న కంచెను కూడా ధ్వంసం చేసినట్లు బాధితులు తెలిపారు. దీనిపై పరిగి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధిత రైతులు తెలిపారు. ఇదిలా ఉంటే పరిగి మండలంలో ఇలాంటి విషసంస్కృతి గతంలో ఎప్పుడూ లేదని ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పచ్చని చెట్లపై ఇలా చేయడంతో ఇతర రైతులకు కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీటిని నరికేసిన నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించకపోతే ఇతర రైతుల్లో ఆందోళన నెలకొంటుందని అంటున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో రాజకీయ పరంగా వారిని భయపెట్టేందుకు చేశారా లేక ఇతర కారణాలేవైనా ఉన్నాయా అనే విషయాలు పోలీసుల దర్యాప్తులో తెలియాల్సి ఉంది.



వక్క చెట్లను నరికేసిన దృశ్యం

ఓపీఎస్ పునరుద్ధరించే పార్టీకే మా మద్దతు

యూటీఎఫ్ నాయకులు

పెనుకొండ, ఫిబ్రవరి 6 : పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించే పార్టీకే రాబోయే ఎన్నికల్లో ఉద్యోగ, ఉపాధ్యాయుల మద్దతు ఉంటుందని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి సుధాకర్ పేర్కొన్నారు. స్థానిక జూనియర్ కళాశాలలో మంగళవారం ఓట్‌ఫర్ ఓపీఎస్ పోస్టర్లను యూటీఎఫ్ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ నాయకులు సుధాకర్ మాట్లాడుతూ... పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించే పార్టీకే ఉద్యోగ, ఉపాధ్యాయుల మద్దతు ఉంటుందని పేర్కొన్నారు. ఉద్యోగి జీవిత కాలం పనిచేసి పదవీవిరమణ తరువాత భద్రత కోసం సాధించుకున్న పెన్షన్ విధానాన్ని రద్దుచేసి జీపీఎస్, సీపీఎస్ అంటూ భవిష్యత్తును అంధకారంలో నెట్టివేస్తూ ప్రభుత్వం చలగాటం ఆడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఎవరైతే పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తారో వారికే మద్దతు ప్రకటిస్తామన్నారు. అనంతరం ఉద్యమ కార్యచరణ ప్రకటించారు. ఈ నెల 6నుంచి 15వరకు పోస్ట్‌కార్డుల ద్వారా ఉద్యమం, 13నుంచి 29వరకు ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని కోరుతూ గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఉద్యమం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి నరేష్‌కుమార్, మహిళా కమిటీ నాయకులు హసీనాబేగం, నారాయణస్వామి, రమేష్, రవీంద్రనాథ్, ఉపేంద్ర, అశ్వత్థప్ప, లక్ష్మానాయక్, ఆది, దినేష్, రామాంజనేయులు, శ్రీనివాసులు, నరసింహులు, శేషాద్రి, చిన్నవెంకటేశులు, గౌరమ్మ, నాగమణి, రాధామణి, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు రాకపోకలు బంద్

రాప్తాడు, ఫిబ్రవరి 6: రాప్తాడు సమీపంలోని రైల్వే పై ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు జరుగుతున్న కారణంగా బుధ, గురు వారం రైల్వే గేటు వద్ద రాకపోకలు నిలిపివేసినట్లు అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటశివారెడ్డి, రాప్తాడు సీఐ మునిస్వామి ప్రకటించారు. బుధ, గురు వారం ఆ దారి గుండా వెళ్లే వాహనదారులు ప్రత్యామ్నాయ దారుల గుండా వెళ్లాలన్నారు. కదిరి నుంచి పంగల్ రోడ్డు, రాప్తాడు మీదుగా జాతీయ రహదారి 44పై వెళ్లే వాహనాలు అనంతపురం టౌన్ మీదుగా వెళ్లాలన్నారు. హైదరాబాద్, మరూరు టోల్ గేటు నుంచి కదిరి వెళ్లే వాహనాలు అనంతపురం టౌన్ మీదుగా పంగల్‌రోడ్డు, కదిరి వైపు వాహనాలు వెళ్లవచ్చన్నారు. కదిరి వైపు నుంచి వచ్చే భారీ వాహనాలు, కలెక్టరేట్, చెరువుకట్ట, మీదుగా సోమలదొడ్డి వద్ద జాతీయరహదారి 44పై హైదరాబాద్‌కు వెళ్లవచ్చన్నారు. వాహనదారులు పోలీసులకు సహకరించాలని కోరారు.

గ్రామాల్లో తనిఖీలు

గోరంట్ల, ఫిబ్రవరి 6: మండలంలోని పోలింగ్ కేంద్రాలు, గ్రామ సచివాలయాల ను నూతనంగా బాధ్యతలు స్వీకరించిన త హసీల్దార్ అక్బర్ బాషా, ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ విడివిడిగా తనిఖీలు చేశారు. మండలంలో 75 పోలింగ్ కేంద్రాలుండగా... గుమ్మయ్యగారిపల్లి, మల్లాపల్లి, పాలస ముద్రం, బెల్లాలచెరువు, బోయలపల్లి, వడిగేపల్లి, రెడ్డిచెరువుపల్లి ప్రాథమిక పాఠశాలలో నిర్వహించనున్న పోలీస్ కేంద్రాలను తహసీల్దార్ పరిశీలించారు. పోలింగ్ కేం ద్రాల్లో వసతి సదుపాయాలు, తీసుకోవాల్సిన చర్యలపై ఆరాతీశారు. ఆయనతో పాటు సీఐ సుబ్బరాయుడు, ఆర్ఐ సోమశేఖర్‌రెడ్డి, వీఆర్‌ఓలు సల్మాన్, ఓబులే సు, మునెప్ప తదితరులు పాల్గొన్నారు. కాగా గోరంట్లలోని పట్టుపరిశ్రమ కార్యాలయం, సంత మార్కెట్, 1 4, గ్రామ సచివాలయాలను ఎంపీడీఓ తనిఖీ చేశారు. ఇళ్లపట్టాల రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ఎన్నికలకు సంబంధించిన పనులను ఎప్పటికపుడు పూర్తి చేస్తూ, మెరుగైన సేవలందించాలని సూచించారు. ఆయన తోపాటు ఈఓఆర్‌డీ సుధాకర్, సచివాలయ సిబ్బంది ఉన్నారు.



మల్లాపల్లి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పెనుకొండ రూరల్ : రానున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని మండలంలోని కియ ఇండస్ట్రియల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న పోలింగ్ కేంద్రాలను సీఐ యుగంధర్, ఎస్ఐ రంగడు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల వద్ద సెల్‌ఫోన్ సిగ్నల్స్ అందుతాయా, పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు ఉన్నాయా అనే పలు విషయాలపై ఆరాతీశారు.

వ్యక్తి ఆత్మహత్య

ధర్మవరం, ఫిబ్రవరి 6: పట్టణంలోని బసవన్నకట్ట వీధికి చెందిన రామక్రిష్ణారెడ్డి(38) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. రామక్రిష్ణారెడ్డి రైల్వేస్టేషన్‌లో వడలు, చిరుతిండ్లు అమ్ముతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అయితే మంగళవారం రాత్రి ఇంటిలో ఓ గదిలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు అతడిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

ఘనంగా గంగమ్మ విగ్రహ ప్రతిష్ఠ



ఆలయంలో ప్రతిష్ఠించిన గంగమ్మ విగ్రహం

గోరంట్ల, ఫిబ్రవరి 6: మండలంలోని కసిరెడ్డిపల్లి అంబేడ్కర్ కాలనీలో నూతనంగా నిర్మించిన ఆలయంలో గంగమ్మ, శీతలాదేవి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామ ప్రజల సహకారంతో కాలనీలో దాదాపు రూ.30లక్షల వ్యయంతో గంగమ్మ నూతన ఆలయాన్ని నిర్మించారు. మూడురోజులుగా పురోహితులు క్షేమేంద్రశర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు, కలశార్చన, హోమాలు, విగ్రహ ప్రాణప్రతిష్ఠ మహా మంగళ హారతి నిర్వహించారు. ఆలయ నిర్మాణం కోసం స్థానికులు తమవంతు సాయం అందించారు. ఈ సందర్భంగా దాతలను ఆలయ కమిటీ ఘనంగా సన్మానించింది. వేడుకల్లో పెద్దఎత్తున మహిళలు, గ్రామస్థులు పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు.

సీఐటీయూ నాయకులకు నోటీసులు



సీఐటీయూ నాయకుడు రమేష్‌కు నోటీసు అందజేస్తున్న పోలీసు

పెనుకొండ, ఫిబ్రవరి 6 : మునిసిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం జిల్లా కేంద్రంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించనున్న ధర్నా కార్యక్రమానికి వెళ్లకుండా సీఐటీయూ నాయకులకు పోలీసులు నోటీసులు జారీ చేశారు. పెనుకొండ పట్టణంలోని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమేష్ ఇంటికి మంగళవారం ఉదయం 6గంటలకే పోలీసులు వెళ్లారు. ధర్నాకు వెళ్లకూడదని ఆయనకు సూచిస్తూ నోటీసు అందజేశారు.

అంగన్‌వాడీలకు వసతులు కల్పించాలి
సీఐటీయూ నాయకుల డిమాండ్

పెనుకొండ, ఫిబ్రవరి 6: సీడీపీఓ కార్యాలయంలో ప్రాజెక్ట్ సమావేశాలకు హాజరయ్యే అంగన్‌వాడీ కార్యకర్తలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో మంగళవారం అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రాజెక్ట్ సమావేశం నిర్వహించారు. సమావేశ ప్రాంతంలో పరిస్థితులను సీఐటీయూ నాయకులు పరిశీలించారు. అనంతరం సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ... ప్రాజెక్ట్ సమావేశాలకు వచ్చే అంగనవాడీ కార్యకర్తలకు కనీస సౌకర్యాలు కల్పించకుండా ఐసీడీఎస్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. తాగడానికి నీరు కూడా లేవన్నారు. మరుగుదొడ్లు ఉన్నప్పటికీ వాటికి నీటి సౌకర్యం లేదని ఈ విషయాన్ని పలుమార్లు సీడీపీఓకు తెలిపినప్పటికీ పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వారి సమస్యలు పరిష్కరించాలని లేనిపక్షంలో సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. అనంతరం పెనుకొండ, రొద్దం మండలాలకు సంబంధించి అంగన్‌వాడీ ఆయాల ప్రాజెక్ట్ నూతన కమిటీలను ఎన్నుకున్నారు. పెనుకొండ మండల కమిటీ అధ్యక్షురాలిగా చక్రీబాయి, కార్యదర్శిగా మాలతి, రొద్దం మండల కమిటీ అధ్యక్షురాలిగా చంద్రమ్మ, కార్యదర్శిగా కవితను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పెడపల్లి బాబా, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు బావమ్మ తదితరులు పాల్గొన్నారు.

చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలి : ఏపీపీ

పెనుకొండ : మహిళలకు చట్టాలపై ప్రాథమిక అవగాహన అవసరమని పెనుకొండ ఏపీపీ భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో మంగళవారం అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలకు సీడీపీఓ శాంతలక్ష్మి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఏపీపీ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ... మహిళల హక్కులు, చట్టాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్‌లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం
ప్రజలకు అవగాహన కల్పించిన ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు

పెనుకొండ రూరల్, ఫిబ్రవరి 6 : ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎన్‌ఎస్‌ఎస్ పీఓ హఫీజ్ పేర్కొన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో పెనుకొండ నగర పంచాయతీలోని మంగాపురంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రత్యేక శిబిరం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గ్రామంలో నాలుగోరోజు మంగళవారం గ్రామస్థులకు రక్తహీనతకు సంబంధించి మాత్రలు పంపిణీ చేశారు. పౌష్టికాహారం తీసుకుంటే కలిగే ప్రయోజనాలపై వివరించారు. ధూమపానం, మద్యపానం వల్ల కలిగే అనర్థాలు గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బషీర్ అహ్మద్, చరిత్ర అధ్యాపకులు నరసింహమూర్తి, పీఓ శంకర్‌నాయక్, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల: మండలంలోని ఎముకలగుట్టపల్లిలో ఎస్‌పీఎస్ జూనియర్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు శ్రమదానం, మొక్కలు నాటే కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టారు. కళాశాల ఆవరణంలోని పిచ్చి మొక్కల ను తొలగించి శుభ్రం చేశారు. అనంతరం మొక్కలు నాటే కార్యక్రమంలో ప్రిన్సి పాల్ అడవాల సూర్యనారాయణ, ఏఎన్‌కే డిగ్రీ కళాశాల ఏఓ శ్రీనివాసులు పాల్గొన్నారు. గ్రామంలోని యువతకు కేరీయర్ కౌన్సిలింగ్, కమ్యూనికేషన్ స్కిల్స్‌పై అవగాహన కల్పించారు. అధ్యాపకులు రమేష్, ఎన్‌ఎస్‌ఎస్ పీఓ బాబు, విద్యార్థులున్నారు.



మంగాపురంలో అవగాహన కల్పిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు